




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 11 సంచిక : 323 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 28 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :323 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 28 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur







## సింగపూర్ తో గ్యాప్ వచ్చింది... అది సరిచేయడానికే ఇక్కడికి వచ్చాను

- సింగపూర్ లో తెలుగు వారితో సీఎం చంద్రబాబు సమావేశం
- సింగపూర్ మళ్లీ ఏపీ క్యాపిటల్ నిర్మాణానికి ముందుకు రాకపోవచ్చన్న చంద్రబాబు
- కానీ జరిగిందేమిటో వారికి వివరిస్తానని వెల్లడి





ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన తొలిరోజున ఏపీఎన్ఆర్ టీ భాగస్వామ్యంతో ఏర్పాటైన తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగపూర్ తో పాటు, పొరుగున్న మరో ఐదు దేశాల నుంచి తెలుగు ప్రజలు భారీ ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరుకావడంతో చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికరంగా ప్రసంగించారు.

"సింగపూర్ దేశం అంటే నాకు చాలా అభిమానం... గౌరవం. నీతి, నిజాయతీలకు సింగపూర్ దేశం నిలువెత్తు నిదర్శనం. ఈ దేశంలో అవినీతి తక్కువ. సింగపూర్ రోడ్ల మీద ఒక్క కాగితం ముక్క కూడా కన్పించదు. చాలా కాలం క్రితమే చెత్తను కూడా ఎనర్జీగా కన్వెర్ట్ చేసే విధానాన్ని సింగపూర్ ఆచరణలో పెట్టింది. అదే తరహా విధానాన్ని హైదరాబాద్ నగరంలో అమలు చేశాను. చాలా మంది రాజకీయ నేతలు సింగపూర్ వచ్చి ఎంజాయ్ చేసి వెళతారు. కానీ ఏపీ సీఎం మాత్రం ఇక్కడికి వచ్చి తాను చేసిన మంచి పనులను అమలు చేస్తున్నారని సింగపూర్ దేశ మాజీ ప్రధాని లీ క్వాన్ యూ చెప్పారు. ఇలాంటి సింగపూర్ ప్రభుత్వంతో ఏపీకి గ్యాప్ వచ్చింది.

నేను అడిగిన వెంటనే ఉచితంగా అమరావతి కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేయడానికి సింగపూర్ ప్రభుత్వం అంగీకరించింది. సింగపూర్ ప్రభుత్వం చాలా దేశాల్లో టౌన్ షిప్ లు కట్టింది. కాబట్టి సీడ్ క్యాపిటల్ నిర్మాణం సింగపూర్ ప్రభుత్వానికే అప్పగించాను. కానీ 2019లో ప్రభుత్వం మారి సింగపూర్ ను తప్పు పట్టే పరిస్థితి తీసుకువచ్చారు. వాటిని సరిదిద్ది... రికార్డులు సరి చేయడానికే సింగపూర్ వచ్చాను. ఏపీ బ్రాండును సింగపూర్ లో తిరిగి నెలకొల్పడానికే వచ్చాను. మన రాష్ట్రంలో ఏ ఒక్కరు తప్పు చేసినా... తెలుగు వాళ్లే చేశారంటారు. ఆ అభిప్రాయాన్ని... సింగపూర్ ప్రభుత్వంలో, సింగపూర్ కంపెనీల్లో తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాను. సింగపూర్ కు కలిగిన అసౌకర్యానికి బాధపడుతున్నానని వారికి చెబుతున్నాను. సింగపూర్ ప్రభుత్వం మళ్లీ సీడ్ క్యాపిటల్ నిర్మాణానికి ముందుకు రాకపోవచ్చు. జరిగిన వాస్తవాలను మాత్రం వారికి తెలియచేస్తాను. 2019లో కూడా మన ప్రభుత్వమే కొనసాగి ఉంటే.. అమరావతి సింగపూర్ స్థాయికి చేరేది. కానీ 2019 ఎన్నికల్లో గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇలాంటి పొరపాట్లు రాకుండా చూసుకోవాలి.

వివరాలు 2లో..

## ఐదేళ్లలో ఎంత నష్టం జరిగిందో అంతకు వడ్డీతో కలిపి తీసుకువస్తాం




- సింగపూర్ లో తెలుగు డయాస్పొరాతో మంత్రి నారా లోకేశ్ సమావేశం
- రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కష్టపడుతోందని వెల్లడి
- సింగపూర్ ను ఆదర్శంగా తీసుకుని కొత్త విధానాలు అమలు చేస్తున్నామని స్పష్టీకరణ

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీ ఎంతలా నాశనమైందో మీకు తెలుసు... రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఎంత కష్టపడుతోందో మీరంతా చూస్తున్నారు.... చంద్రబాబు గారి పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న నమ్మకమే మన పెట్టుబడి... మన రాష్ట్రంలో ఉన్న అవకాశాలను ప్రచారం చేసి పెట్టుబడులు రాబడదామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. సింగపూర్ ఓవిస్ ఆడిటోరియంలో ఏపీఎన్ఆర్టీ ఆధ్వర్యాన నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశానికి మంత్రి లోకేశ్ అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఎంత నష్టపోయిందో, అంతకు అంత వడ్డీతో కలిపి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**తెలుగువారిని ప్రపంచపటంలో నిలిపిన చంద్రబాబు**

తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని, దానిని నిలబెట్టింది ఎన్టీ రామారావు

వివరాలు 2లో..

## చిత్తూరు జిల్లాలో ఏనుగుల దాడిలో రైతు మృతి... పవన్ కల్యాణ్ స్పందన

- ఏనుగుల దాడిలో రైతు మృతి పట్ల పవన్ కల్యాణ్ విచారం
- పరిహారం చెల్లించాలని అధికారులకు సూచన
- తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం

వివరాలు 2లో..



## తమిళనాడు సీఎం స్టాలిన్ నివాసానికి బాంబు బెదిరింపు



- ఉదయం పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ కాల్
- సీఎం నివాసంలో బాంబు పెట్టామన్న అజ్ఞాత వ్యక్తి
- భారీ ఎత్తున తనిఖీలు చేసిన పోలీసులు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్
- ఏమీ లేదని తేల్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్న వైనం
- బెదిరింపు కాల్ పై దర్యాప్తు

వివరాలు 2లో..




## గోక్కుంటే...పీక్కోవాల్సి వస్తుందే.. కేటీఆర్ వ్యూహం బెడిసి కొట్టిందా?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరిస్థితి మయసభలో దుర్యోధనుడి తరహాలో మారినట్లు కనపడుతుంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత ఏల ఇరుక్కోవలె? ఇరుక్కుంటిమి పో.. తీహార్ జైలుకు ఎందుకు వెళ్లవలె.. వెళ్లితిమి పో.. తాను ఎందుకు ఢిల్లీకి ఎందుకు వెళ్లవలె.. వెళ్లినితిని పో... బెయిల్ పై న్యాయవాదులతో చర్చించకుండా బీజేపీ నేత సీఎం రమేష్ నాయుడును ఎందుకు కలవవలె? కలసినితిని పో...బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేస్తానన్న ప్రతిపాదన ఎందుకు తేవలె.. తెచ్చితిని పో... హెచ్.సి.యూ భూములపై రేవంత్ రెడ్డి పై కోపంతో రమేష్ పేరు ఎందుకు ప్రస్తావించవలె... ప్రస్తావించితినిపో... ఫోర్త్ సిటీ కాంట్రాక్టు పనులను ఏల ప్రజల ముందుంచవలె...హతవిధీ... ఇప్పుడు అటు ఇటు తిరిగి బీజేపీతో విలీనం పై రచ్చ ఏల జరగవలె.. అన్నట్లుంది కేటీఆర్ వ్యవహారం.

**బండి సంజయ్ ఎంట్రీతో...**

సీఎం రమేష్ నాయుడు, కేటీఆర్ మధ్య జరుగుతున్న వివాదంలో ఇప్పుడు కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ఎంట్రీ ఇచ్చారు. ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఇప్పుడు అసలు సమస్య పక్క దారి పట్టి బీజేపీతో బీఆర్ఎస్ విలీనం మాత్రమే హైలెట్ అవుతుంది. వాస్తవానికి హెచ్.సి.యూ భూమి వివాదంలో సీఎం రమేష్ రేవంత్ రెడ్డికి సహకరించారన్నది కేటీఆర్ ఆరోపణ. అదే సమయంలో ఫోర్త్ సిటీలో 1600 కోట్ల రూపాయల పనులను సీఎం రమేష్ కు అప్పగించారన్న సెంటిమెంట్ తో పార్టీకి కొంత హైప్ తేవాలనుకున్నారు. కానీ రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో కామ్ గా ఉన్నప్పటికీ ఇది బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ గా మారిపోయినట్లు కనపడుతుంది.

**అసలు విషయం పక్కదారి పట్టి...**

అసలు విషయం పక్క దారి పట్టి బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రతిపాదన మాత్రమే హైలెట్ గా నిలిచింది. నాడు కవిత అరెస్టయినప్పుడు ఢిల్లీకి వెళ్లిన కేటీఆర్ ఈ ప్రతిపాదన తెచ్చారన్నది సీఎం రమేష్ ఆరోపణ. అదే సమయంలో తాను అంతటి వాడిని కానని, చెల్లెలుతో వచ్చిన విభేధాలు తనపై ఆరోపణలు చేయడానికి కారణమయ్యారని అంటున్నారు.మరొకవైపు కవిత కూడా కేసీఆర్ కు రాసిన బహిరంగ లేఖలో బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ప్రస్తావన తేవడాన్ని బీజేపీ నేతలు గుర్తు చేస్తున్నారు. మరొకవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా చేసిన వ్యాఖ్యలతో బీఆర్ఎస్ విలీనం హైలెట్ అవుతుంది. కేసీఆర్ కేటీఆర్ కు సిరిసిల్ల టిక్కెట్ ఇవ్వలేదని, అయితే కేటీఆర్ వెళ్లి సీఎం రమేష్ ను కలిశారన్నారు. సీఎం రమేష్ చెప్పబట్టే సిరిసిల్ల టిక్కెట్ కేసీఆర్ ఇచ్చాడన్న బండి సంజయ్ సిరిసిల్ల లో నాడు గెలిచేందుకు కేటీఆర్ కు సీఎం రమేష్ ఆర్థిక సాయం చేసిన మాట కూడా వాస్తవమేనని అన్నారు. సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలో నిజముందన్నారు.

**కేటీఆర్ మాత్రం...**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. సీఎం రమేష్ , సీఎం రేవంత్ ఇద్దరూ కలిసి వస్తే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటలో జరిగిన పదవి వేల కోట్ల కుంభకోణంపైనా, ఫ్యూచర్ సిటీలో ఇచ్చిన రూ.1660 కోట్ల రోడ్ కాంట్రాక్ట్ స్కాంపై.. రెండింటిపైనా కలిసి చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. 10 వేల కోట్లు దోచుకునేందుకు సహకరించినందుకు సీఎం రమేష్ కు రేవంత్ రెడ్డికి ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ గా1660 కోట్ల కాంట్రాక్ట్ అని అన్నారు. ఎప్పటికీ బీఆర్ఎస్ ఏ పార్టీలో విలీనమయ్యే ప్రసక్తే లేదని, తెలంగాణ ఉన్నంత కాలం బీఆర్ఎస్ ఉంటుందని కేటీఆర్ చెబుతున్నాఅసలు చర్చ మాత్రం విలీనం పైనే జరుగుతుంది. మరి కేటీఆర్ చేస్తున్న విమర్శలు ఆయనకే రాజకీయంగా బూమరాంగ్ అవుతున్నాయా? అన్న అనుమానం బీఆర్ఎస్ నేతల్లో కలుగుతోంది. ఇప్పుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విలీనంపైనే ఎక్కువగా వివరణ ఇచ్చుకోవాల్సి వస్తోంది.

# చిత్తూరు జిల్లాలో ఏనుగుల దాడిలో రైతు మృతి... పవన్ కల్యాణ్ స్పందన

ఆంధ్రప్రదేశ్‌లో జనావాసాల్లో ఏనుగుల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏనుగులు సంచరించే మార్గాలపై పర్యవేక్షణ ఉంచాలని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలో ఏనుగుల దాడిలో మరో రైతు మరణించిన ఘటన తర్వాత, ఆయన ఈ సమస్యను తీవ్రంగా పరిగణించారు.

చిత్తూరు జిల్లాలోని కొత్తూరు గ్రామంలో రామకృష్ణ రాజు అనే రైతు పొలంలోకి వెళ్లినప్పుడు ఏనుగుల దాడిలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెంటనే అటవీశాఖ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. గత మూడు నెలలుగా సుమారు 15 ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరిస్తూ వ్యవసాయ భూములను ధ్వంసం చేస్తోందని అధికారులు వెల్లడించారు. అటవీశాఖ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఈ ఏనుగులు మానవ జీవితాలకు, పంటలకు ముప్పుగా మారాయని తెలిపారు. 2011 నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల దాడుల్లో సుమారు 25 మంది మరణించినట్లు అటవీ అధికారులు వివరించారు.

ఈ నేపథ్యంలో, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏనుగుల గుంపులు సంచరించే మార్గాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, ఆయా ప్రాంతాల్లోని రైతులకు ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. మరణించిన రైతు కుటుంబానికి అటవీశాఖ, జిల్లా యంత్రాంగం తరపున సానుభూతిని తెలియజేసి, నష్టపరిహారం అందించాలని సూచించారు.

గతంలో, పవన్ కళ్యాణ్ ఏనుగుల దాడులను నివారించడానికి ఏఐ ఆధారిత ట్రాకింగ్ మరియు అధునాతన హెచ్చరిక వ్యవస్థలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కర్ణాటకలో విజయవంతమైన ఏఐ ఆధారిత ఏనుగుల ట్రాకింగ్ కార్యక్రమాలను అధ్యయనం చేసి, ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలని సూచించారు. ఇప్పటికే కర్ణాటక నుంచి 4 కుంకీ ఏనుగులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాయి. ఈ ఏనుగులకు శిక్షణనిచ్చి, సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరింపజేయనున్నారు. అంతేకాకుండా, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఏనుగులు ఆకర్షించే అరటి, చెరకు వంటి పంటలకు బదులుగా తక్కువ ఆకర్షణీయమైన మినుములు, పప్పుధాన్యాలు వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సలహా ఇవ్వాలని ఆయన అన్నారు.

# తమిళనాడు సీఎం స్టాలిన్ నివాసానికి బాంబు బెదిరింపు

తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నివాసానికి బాంబు బెదిరింపు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేగింది. అయితే, విస్తృత తనిఖీల అనంతరం ఇది తప్పుడు బెదిరింపు అని తేలింది. ముఖ్యమంత్రి నివాసంపై దాడికి బెదిరించిన గుర్తు తెలియని వ్యక్తి కోసం పోలీసులు ముమ్మర గాలింపు చేపట్టారు.

ఆదివారం ఉదయం చెన్నైలోని పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఒక అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. కాల్ చేసిన వ్యక్తి చెన్నైలోని అల్వార్‌పేటలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ నివాసంలో బాంబు పెట్టినట్లు తెలిపాడు. ఈ సమాచారం అందిన వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే చెన్నై నగర పోలీసులు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, స్నిఫర్ డాగ్‌లతో ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్నారు. నివాసం లోపల, బయట అణువణువు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాల్లోని భద్రతను కూడా కట్టుదిట్టం చేశారు. బాంబు డిటెక్షన్, డిస్పోజల్ బృందాలు సుమారు గంటన్నర పాటు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి.

సుదీర్ఘ తనిఖీల అనంతరం, ఎలాంటి పేలుడు పదార్థాలు లేదా అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదు. ఇది కేవలం నకిలీ బెదిరింపు కాల్ అని అధికారులు నిర్ధారించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ఈ తప్పుడు బెదిరింపు కాల్ వెనుక ఎవరున్నారనే దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాల్ చేసిన ఫోన్ నంబర్ ఆధారంగా నిందితుడిని గుర్తించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి స్టాలిన్ నివాసానికి మాత్రమే కాకుండా, ఇటీవల తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్ నివాసానికి కూడా ఇలాంటి బాంబు బెదిరింపు కాల్ వచ్చిందని పోలీసులు వెల్లడించారు. అది కూడా తప్పుడు కాల్ అని తేలింది. ఈ రెండు ఘటనల మధ్య ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సింగపూర్ తో గ్యాప్ వచ్చింది... అది సరిచేయడానికే ఇక్కడికి వచ్చాను

- మొదటి పేజీ తరువాయి

ఈ బాధ్యత నా మీదే కాదు... మీ మీద కూడా ఉంది" అని చంద్రబాబు భావోద్వేగంగా స్పందించారు.

**పెట్టుబడులతో రండి**

"గతంతో పోల్చుకుంటే ఇప్పుడు సాంకేతికంగా చాలా అంశాలు అందుబాటులోకి వచ్చాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీని అభివృద్ధి చేస్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రకటించాం. సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. ఏపీలో 20 పోర్టులు వస్తాయి.. 15-20 ఎయిర్ పోర్టులకు అవకాశం ఉంది. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్, టాటా సంస్థలతో కలిసి పని చేస్తున్నాం. చాలా మంది తెలుగు వాళ్లు విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో కీలక స్థానాల్లో ఉన్నారు. ఇలాంటి వారు తమ అనుభవాన్ని ఏపీకి అందించవచ్చు. పీ4 కార్యక్రమం ద్వారా పేదరికాన్ని తగ్గించేందుకు నో పావర్టీ మిషన్ ప్రారంభించాను. మీ మీ గ్రామాల్లోని పేదలను దత్తత తీసుకోండి. విదేశాల్లో స్థిరపడిన తెలుగు వాళ్లు.. పీ4లో భాగస్వాములుగా ఉంటే.. నాకు అంతకు మించిన ఆనందం వేరొకటి ఉండదు.

**ఏపీలో వెంకన్న ఉండడం మన అదృష్టం**

"తిరుపతి బాలాజీ మన రాష్ట్రంలో ఉండడం అదృష్టం. ఎన్ని కష్టాలున్నా.. వేంకటేశ్వరస్వామిని తలుచుకుని సంకల్పం తీసుకుంటే సమస్య పరిష్కారమై పని అయిపోతుంది. ఎన్నార్టీలకు తిరుమల వెంకన్న దర్శనం కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాం. ప్రతి దేశ రాజధానిలో వెంకటేశ్వరస్వామి దేవాలయం ఉండాలి. సింగపూర్ నుంచి ఏపీలోని విజయవాడ, విశాఖ, తిరుపతికి నేరుగా విమానాలు వచ్చేలా చేస్తాం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతాం. సింగపూర్ లో బెంగాలీ, హిందీ, తమిళ్ రెండో భాషగా ఉన్నాయి. తెలుగు కూడా రెండో భాషగా పెట్టాలని కోరుతున్నాను. ఇక్కడే ఉన్న భారత హైకమిషనర్ ఈ మేరకు చొరవ తీసుకోవాలని కోరుతున్నాను" అని చంద్రబాబు చెప్పారు.

**సరైన నాయకుడు ప్రధాని మోదీనే**

"ప్రస్తుతం భారత దేశానికి ప్రజలే ఆస్తి. గతంతో పోల్చుకుంటే ప్రపంచ వ్యాప్తంగా భారత దేశానికి గౌరవం పెరిగింది. ఈ సమయంలో దేశానికి సరైన నాయకుడుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వహిస్తున్నారు. దేశంలో చాలా మంది ప్రధానులు... చాలా మంది సీనియర్ లీడర్లను చూశాను. రైట్ టైమ్, రైట్ ప్లేస్, రైట్ లీడర్ నరేంద్ర మోదీ. మోదీ మనకు పెద్ద వరం. అమెరికాకు చెందిన ఓ సంస్థ చేసిన సర్వేలో మోదీ ప్రపంచంలోనే పాపులర్ లీడరుగా నెంబర్-1 స్థానంలో నిలిచారు. ప్రధానికి 75 శాతం అప్రూవల్ రేటింగ్ ఉంది. దేశానికి గుర్తింపు, సుస్థిరత మోదీ వల్లే వచ్చింది. ఇలాంటి సమయంలో ఆకాశమే హద్దుగా దూసుకెళ్లాలి. నరేంద్ర మోదీ వికసిత్ భారత్ నినాదంతో వెళుతున్నారు. నేను స్వర్ణాంధ్ర సంకల్పంతో ముందుకెళుతున్నాను" అని అన్నారు.

## కర్మభూమిలో ఎదగండి... జన్మభూమి కోసం నిలవండి: సింగపూర్ లో తెలుగువారికి చంద్రబాబు పిలుపు

### సింగపూర్ లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు

### తెలుగు డయాస్పోరాతో భారీ కార్యక్రమం

### పెద్ద ఎత్తున హాజరైన తెలుగువారు

### ఉత్సాహంగా ప్రసంగించిన చంద్రబాబు




విదేశాల్లో స్థిరపడి... సంపద సృష్టిస్తున్న తెలుగు వాళ్లు జన్మభూమిని మరిచిపోకూడదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఐదు రోజుల సింగపూర్ పర్యటనలో భాగంగా తొలి రోజున ఆదివారం స్థానికంగా ఉన్న వన్ వరల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో తెలుగు డయాస్పొరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సింగపూర్ సహా మలేషియా, థాయ్ ల్యాండ్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా దేశాల్లో స్థిరపడ్డ తెలుగు ప్రజలు హాజరయ్యారు. సీఎం సభా ప్రాంగణానికి రాగానే సభకు హాజరైన వారంతా లేచి నిలబడి హర్షధ్వానాలు చేశారు. మా తెలుగు తల్లి గీతాలాపనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆద్యంతం తెలుగుదనం ఉట్టిపడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రబాబు ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని.. తన సింగపూర్ పర్యటన ఉద్దేశ్యాలను వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రపంచంలో మారుతున్న పరిణామాలను తెలుగు ప్రజలు అందిపుచ్చుకున్నారు. నాడు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు తెలుగు ప్రజల జీవితాలను మార్చాయి. ప్రపంచవ్యాప్తంగా 120 పైగా దేశాల్లో తెలుగు ప్రజలు స్థిరపడ్డారు. ఏ దేశానికైనా వెళ్లి గట్టిగా తెలుగులో మాట్లాడితే, అక్కడున్న తెలుగు వారు ఓ పది నిమిషాల్లోనే పోగయ్యే పరిస్థితి వచ్చేసింది. ప్రపంచంలోని చాలా దేశాలకు తెలుగు వాళ్లు వెళ్లడమే కాదు.. ఆయా దేశాల్లోని స్థానికులకంటే ఎక్కువగా సంపాదిస్తున్నారు. అమెరికాలో ఉండే స్థానికులకంటే.. తెలుగు వారి తలసరి ఆదాయం చాలా ఎక్కువగా ఉంది. సత్య నాదెళ్ల లాంటి వాళ్లు మైక్రోసాఫ్ట్ లాంటి ప్రముఖ కంపెనీలకు సీఈఓలుగా ఉన్నారు. ప్రపంచంలోని చాలా కంపెనీలకు సేవలు అందిస్తూ... మన తెలుగు వాళ్లు వివిధ దేశాల్లో స్థిరపడ్డారు. సింగపూర్ లో 40 వేల మంది తెలుగు వాళ్లు నివాసం ఉంటున్నారు. తెలుగు వాళ్లు ఏయే దేశాల్లో స్థిర పడ్డారో.. ఆ దేశం వారికి కర్మభూమి... అవకాశాలు కల్పించిన ఆ దేశాభివృద్ధి కోసం పని చేయాలి. అదే సమయంలో పుట్టిన గడ్డను తెలుగు వాళ్లు మరువకూడదు. భారతదేశం... ఆంధ్రప్రదేశ్ వారి జన్మభూమి. ఆ జన్మభూమి అభివృద్ధి కోసం తెలుగు వాళ్లు పనిచేయాలి. పెట్టుబడులు పెట్టాలి. అక్కడి పేదలకు చేయూత అందించాలి. భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు కట్టిన పన్నులతో మీరు ఈ స్థాయికి ఎదిగారు... ఎన్నో అవకాశాలు పొందారు. కాబట్టి జన్మభూమి అభివృద్ధికి కృషి చేయడం... పెట్టుబడులు పెట్టడం అనేది బాధ్యతగా తీసుకోవాలి. నేను ఏ దేశం వెళ్లినా... అక్కడి తెలుగు వారిని తప్పకుండా కలుస్తాను" అని సీఎం చెప్పారు.

# ఐదేళ్లలో ఎంత నష్టం జరిగిందో అంతకు వడ్డీతో కలిపి తీసుకువస్తాం

- మొదటి పేజీ తరువాయి

గారని లోకేశ్ పేర్కొన్నారు. తెలుగువారిని ప్రపంచపటంలో నిలిపింది చంద్రబాబు అని, ఆయనే మన బ్రాండ్ అని అన్నారు. ఐటీ గురించి కొందరు విమర్శించినా, చంద్రబాబు ఇంజినీరింగ్ కళాశాలలను స్థాపించినప్పుడు విమర్శించినా, ఈ రోజు అదే కంప్యూటర్లతో తెలుగువారు ప్రపంచాన్ని శాసిస్తున్నారని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల మంది తెలుగు ప్రవాస భారతీయులు ఉండగా, ఫార్ ఈస్ట్‌లో మాత్రమే 3 లక్షల మంది ఉన్నారని, సింగపూర్ సమావేశానికి మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, ఇతర ఫార్ ఈస్ట్ దేశాల నుండి పెద్ద ఎత్తున తెలుగువారు తరలిరావడం మన శక్తికి నిదర్శనమని లోకేశ్ వ్యాఖ్యానించారు.

**సీబీఎన్ బ్రాండ్ తో పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల సృష్టి**

ప్రతి దేశానికి, వస్తువుకు ఒక బ్రాండ్ ఉన్నట్లే, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి అంటే సీబీఎన్ బ్రాండ్ అని లోకేశ్ స్పష్టం చేశారు. ఈ బ్రాండ్‌తో ప్రపంచంలో ఎక్కడికెళ్ళినా పెట్టుబడులు వస్తాయని, రాష్ట్రానికి పెట్టుబడులు సాధించే తమ ప్రయత్నాలకు ఎన్ఆర్ఐల సహకారం అవసరమని కోరారు. సింగపూర్‌ను ఆదర్శంగా తీసుకుని నూతన పారిశ్రామిక విధానాలు అమలు చేస్తున్నామని, వేగంగా వ్యాపారం చేసేందుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నామని తెలిపారు. దాదాపు 1000 కిలోమీటర్ల తీర ప్రాంతం, పోర్టులు, విమానాశ్రయాలు, హైవేలు, భూములు వంటి అపారమైన వనరులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని, ఇది పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారనుందని చెప్పారు. టీసీఎస్, కాగ్నిజెంట్, సత్వ, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయని, ఎస్ఆర్ఎం, విట్, అమృత వంటి విద్యాసంస్థలు వచ్చాయని, బిట్స్ పిలానీ త్వరలో రానుందని వెల్లడించారు."20 లక్షల ఉద్యోగాల కల్పన... ఇదే మన నినాదం... ఇదే మన విధానం" అని లోకేశ్ పునరుద్ఘాటించారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన పిలుపుతో జన్మభూమి కార్యక్రమానికి ఎన్నారైలు అండగా నిలిచారని, ఇప్పుడు జీరో పావర్టీ లక్ష్యంగా చంద్రబాబు తలపెట్టిన పీ4 (%ూ%4) కార్యక్రమంలో ప్రవాసులు భాగస్వాములు కావాలని కోరారు. పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలన్నదే చంద్రబాబు గారి కోరిక అని, ఆరోగ్యవంతమైన, సంపన్నవంతమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ కోసం అందరూ కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. పీ4 లో మార్గదర్శిగా చేరి పేద కుటుంబాలకు ఆసరాగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్**

ఆంధ్రప్రదేశ్‌లో 'డబుల్ ఇంజిన్ సర్కార్' నడుస్తోందని, కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఐదేళ్లలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని వడ్డీతో సహా తిరిగి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఇతర దేశాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) కంపెనీలను కూడా ప్రోత్సహిస్తామని, ప్రపంచవ్యాప్తంగా 80 శాతం ఉద్యోగాలు ఎంఎస్ఎంఈల ద్వారానే వస్తున్నాయని పేర్కొన్నారు. టీసీఎస్‌లో 35 శాతం తెలుగువారు పనిచేస్తున్నారని, అందుకే ఏపీకి వస్తున్నామని టాటా ఛైర్మన్ చంద్రశేఖరన్ చెప్పారని లోకేశ్ గుర్తు చేశారు. శాసనసభ్యుల్లో 50 శాతం మంది కొత్తవారు ఉన్నారని, మంత్రివర్గంలో 17 మంది కొత్తవారు ఉన్నారని, అందరూ సహకరిస్తే ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ 1గా తయారుచేస్తామని, అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. సింగపూర్‌లో ఇంతమంది తెలుగువారు రావడం తన జీవితంలో మర్చిపోలేని రోజని, ఇక్కడున్న వారిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే తపన కనిపిస్తోందని ఆయన ప్రశంసించారు. ఏపీఎన్ఆర్‌టీ 2.0ని ప్రారంభించామని, ఎన్ఆర్ఐలకు ఎటువంటి సమస్యలున్నా ఏపీఎన్ఆర్‌టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చివరగా, పహల్గాం దాడిలో వీరమరణం పొందిన మన రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్‌కు నివాళు లర్పించాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

## టీటీడీ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన గౌహతి కామాఖ్య దేవస్థానం పండితులు



తిరుపతి పెన్ పవర్ జూలై 27 : అస్సాం రాష్ట్రం గౌహతిలోని ప్రసిద్ధ కామాఖ్య ఆలయ పండితులు శ్రీ దీక్షిత్ ప్రసాద్ శర్మ, రోహిత్ భాయ్ రబాడియా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కామాఖ్య అమ్మవారి ఆలయ విశేషాలు చైర్మన్‌కి వివరించిన పండితులు, గౌహతిలోని ఆలయాన్ని సందర్శించేందుకు విచ్చేయాలని చైర్మన్ ను ఆహ్వానించారు.


# పెన్ పవర్

వై.ఎస్.ఆర్. కడప

అన్నమయ్య జిల్లా




### టీటీడీ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన

## రాష్ట్ర సీఎస్ కె.విజయానంద్

**తిరుపతి పెన్ పవర్ జూలై 27 :** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ దర్శనానంతరం టీటీడీ చైర్మన్ క్యాంప్ కార్యాలయానికి వెళ్లి, చైర్మన్ బీ.ఆర్.నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల టీటీడీలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చైర్మన్ బీ.ఆర్ నాయుడు సీఎస్‌కు వివరించారు.

అందరి సమన్వయంతో భక్తులకు టీటీడీ మరింత మెరుగైన సేవలు అందిస్తోందని సీఎస్ కు వివరించారు.

## "సుపరిపాలనలో తొలి అడుగు"









ఈస్ట్ గోదావరి పెన్ పవర్ జులై 27 : ఈస్ట్ గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలోని చాగల్లు గ్రామంలో నిర్వహించిన "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర ఆర్థిక&ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు శ్రీ పయ్యావుల కేశవ్ గారు పాల్గొన్నారు. ఆదివారం కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావుతోపాటు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా ఎమ్మెల్యే నివాసానికి విచ్చేసిన మంత్రివర్యులకు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు ఉత్సాహభరితంగా ఘన స్వాగతం పలికారు. తరువాత గ్రామంలో గడప గడపకు వెళ్లి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను మంత్రి ప్రజలకు వివరించారు. ప్రజలు అందరూ ఎంతో ఆనందంగా స్పందించడంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపట్ల, అభివృద్ధి పనుల పట్ల తాము పూర్తిగా సంతృప్తిగా ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న మంత్రివర్యులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ప్రజల ఆశల్ని నెరవేర్చే విధంగా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని హామీ ఇచ్చారు.

## విజ్ఞానాన్ని, యుక్తిని మేళవించి రచించిన బాలసాహిత్యకర్త ఆర్.సి.కృష్ణస్వామి రాజు




కడప పెన్ పవర్ జులై 27 : విజ్ఞానాన్ని, యుక్తిని మేళవించి బాలసాహిత్యాన్ని సృష్టించిన మేటిరచయిత ఆర్.సి.కృష్ణస్వామి రాజు అని విశ్రాంత తెలుగు పండితులు డా. నెమిలేటి కిట్టన్న (తిరుపతి) అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 145వ సదస్సు నిర్వహింపబడిరది. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచనలు చిత్తూరు జిల్లా మాండలికంలో, జనం మాట్లాడుకొనే భాషలో ఉంటాయని, అదేవిధంగా అక్కడి ప్రాంతాలే ఆయన కథాకేంద్రాలుగా ఉంటాయన్నారు. ఆ తర్వాత 'ఆర్.సి.కృష్ణస్వామి రాజు బాలసాహిత్యం' అనే అంశంపై విశ్రాంత తెలుగు పండితులు డా. నెమిలేటి కిట్టన్న ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో రాయలసీమ కథాసాహిత్యానికి వన్నె తెచ్చిన కథకుల్లో ఆర్.సి. కృష్ణస్వామి రాజు ఒకరని, బాలసాహిత్యకర్తగా కూడా ఆయన గురుతరమైన బాధ్యతను నిర్వర్తిస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఆయనవి చిన్నాపెద్దా కథలు 650 దాకా వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయని, వీటిలో 150 పిల్లల కథలు ఉండడం విశేషమన్నారు. ఆర్.సి. కృష్ణస్వామి రాజు గారు తిరుపతి జిల్లా పుత్తూరు శల్య వైద్య కుటుంబానికి చెందినవారన్నారు. ఆయన మొదట కార్వేటి నగరం డైట్‌లో అధ్యాపక ట్రైనింగ్ పూర్తిచేశారని, ఆ తర్వాత తిరుపతి ఎల్.ఐ.సి కార్యాలయంలో 35 ఏళ్ళ పాటు డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారన్నారు. ఆయన ఇప్పటి దాకా భిన్న వర్గాలకు చెందిన 18 కథా సంపుటాలను, 2 నవలలను వెలువరించారన్నారు. బాల సాహిత్య సృష్టిలో భాగంగా ఆయన' రాజు గారి కథలు, రాణి గారి కథలు, కార్వేటినగరం కథలు, నాన్నారం కథలు' అనే కథాసంపుటాలను, 'మేకల బండ, మునికిష్టడి మాణిక్యం' అనే నవలలను రాశారన్నారు. ఈ రచనల్లో ఆయన వాడిన తెలుగు జాతీయాలను, సామెతలను, నుడికారాలను ఉదాహరణలతో వివరించారు. మానవీయ సంబంధాలు, విలువలు కృష్ణస్వామి రాజు బాలసాహిత్యంలో ఎలా చిత్రింపబడిరది విశ్లేషణాత్మకంగా తెలియజేశారు. కార్యక్రమాన్ని డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డా. చింతకుంట శివారెడ్డి సమన్వయం చేశారు.

కార్యక్రమం అనంతరం వక్త డా. నెమిలేటి కిట్టన్నను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా. భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డా. చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు కలసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అహ్మద్ బాషా, పళ్ళె విజయ్, కుమార్, కొత్తపల్లె రామాంజనేయులు, శ్యామసుందర్ రెడ్డి, రమణమూర్తి, వెంకట రమణ, విజయ కుమార్, సుబ్బరాయుడు, బాలరాజేశ్వర రెడ్డి, నల్లపరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 1000 మందిచే అష్టలక్ష్మి వైభోగ వ్రతం...



తిరుపతి పెన్ పవర్ జులై 27 : శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా తిరుపతి నగరంలో రామచంద్ర పుష్కరిణి నందు అష్ట లక్ష్మీ వైభోగ వ్రతం వెయ్యి మంది మహిళల చే చేయించబడినది. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షురాలు శ్రీమతి మురళి అమ్మ వారు, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతి వసుంధర మొదలైన వారి ఆధ్వర్యంలో జరుపబడినది. ఈ కార్యక్రమంలో సహకరించిన మహిళలందరికీ ధన్యవాదములు , అలాగే కార్యక్రమానికి సంకల్పకర్త శ్రీ టెలిఫోన్ గురూజీ రాజమండ్రి వారిచే చేయించబడినది. దాదాపు వెయ్యి మంది భక్తులచే , తదితర మహిళలు పాల్గొని అమ్మవారి పుష్కరిణి లక్ష్మీ వైభోగవ వ్రతంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులైనారని, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షురాలు వసుంధర తెలియజేశారు.

## హాస్టల్ విద్యార్థులకు వసతుల బాధ్యత హాస్టల్ వార్డెన్‌లదే..

### - తాసిల్దార్ సురేష్ బాబు



**ధర్మవరం పెన్ పవర్ జులై 27 :** పట్టణములోని ప్రతి హాస్టల్లో కూడా విద్యార్థులకు అన్ని వసతులు తప్పనిసరిగా కల్పించాల్సిన బాధ్యత హాస్టల్ వార్డెన్ లదే నని తాసిల్దార్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా గత కొన్ని రోజులుగా కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టలను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం, బీసీ బాలుర హాస్టల్-గుట్ట కింద పల్లి, దుర్గా నగర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాలకుల వసతిగృహం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా సాయంత్రం వేళలో తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో కొన్ని ఫిర్యాదులు కూడా అందడం జరిగింది. తదుపరి నేరుగా తాసిల్దార్ విద్యార్థులతో హాస్టల్లో గల వసతులపై మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ వారు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించే విధంగా హాస్టల్ వార్డెన్లు తొందరగా పరిష్కరించాలని వారు ఆదేశించారు. అనంతరం తాసిల్దార్ సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి హాస్టల్లో కూడా సుచి, శుభ్రత పాటించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూను తప్పనిసరిగా, విధిగా అమలు చేయాలని, లేనియెడల వార్డెన్లపై చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అదేవిధంగా రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని తెలిపారు. వంట చేసే గదిలో జాగ్రత్తగా నియమ నిబంధనను పాటించాలని, ఫుడ్ పాయిజన్ లేకుండా తగిన జాగ్రత్తలను వంట చేసే వారితో పాటు, వార్డెన్లు కూడా ప్రతిరోజు జాగ్రత్తలను పాటించాలని తెలిపారు. విద్యార్థుల ద్వారా గాని, తల్లిదండ్రుల ద్వారా గాని, సోషల్ మీడియా ద్వారా గాని ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. విద్యార్థులందరికీ కూడా మినరల్ వాటర్ తప్పక అందజేయాలని, మరుగుదొడ్లు, టాయిలెట్లు శుభ్రంగా ఉండాలని, రోగాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రతి గదిలో ఫ్యాన్లు, దోమతెరలు ఉండే విధంగా కచ్చితంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా హాస్టల్లో వార్డెన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీ గవర్నర్కు సాధన స్వాగతం..



**తిరుమల , పెన్ పవర్ జూలై 27 :** తిరుమల శ్రీపద్మావతి అతిథి గృహం కు చేరుకున్న ఆ.ప్ర.రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి సాదర స్వాగతం పలుకుతున్న టిటిడి ఈఓ శ్యామలరావు.

# ఒక ఫోన్ కాల్.. ఒక పరిష్కారం

## ఇది మంత్రివర్యుల సత్య కుమార్ యాదవ్ శైలి



**ముదిగుబ్బ పెన్ పవర్ జూలై 27 :** సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండల కేంద్రంలో గత 15 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ బాధ్యతతో స్పందించారు. ఈ కార్మికులు గత 9 నెలలుగా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ, ప్రాజెక్టులో పనులు నిలిపివేస్తూ నిరసన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రికి సమాచారం అందిన వెంటనే, వారు చురుకుగా స్పందించి అనంతపురం జిల్లా కలెక్టర్ తో టెలిఫోన్ ద్వారా మాట్లాడారు. కార్మికుల సమస్యను అర్థవంతంగా వివరిస్తూ, తక్షణమే జీతాల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు సంబంధిత అధికార యంత్రాంగం స్పందించి, రెండు రోజుల్లోగా బకాయి జీతాలు చెల్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో ముదిగుబ్బ మండల కేంద్రంలో గత రెండు వారాలుగా నిలిచిపోయిన నీటి సరఫరా శనివారం నుండి పునఃప్రారంభమైంది. దీని వల్ల మండల ప్రజలు ఉపశమనం పొందారు.

## ఇన్నోవా, స్కూటర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు







రాజంపేట పెన్ పవర్ జూలై 27 : అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బోయినపల్లి వద్ద స్కూటర్ ఇన్నోవా కారు ఢీకొన్న ఘటనలో స్కూటర్లో ప్రయాణిస్తున్న నివేద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు 108 అంబులెన్స్ ద్వారా రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగినది ఘటన స్థలానికి చేరుకున్న మన్నూరు సిఐ కులాయప్ప ట్రాఫిక్‌ను క్లియర్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలియ రావాల్సి ఉన్నది.

### తరిగొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ

**తిరుపతి పెన్ పవర్ జులై 27 :** అన్నమయ్య జిల్లా తరిగొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ కొరకు జూలై 30 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు మూడు రోజుల పాటు బాలాలయం నిర్వహించనున్నారు. ఇందుకోసం జూలై 29న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. జూలై 30వ తేదీ ఉదయం చతుష్టానార్చన, బింబ, కుంభ, కుండ, ద్వార, తోరణ, అండరాల, పాతక, దేవతాప్రతిష్ఠలు, సాయంత్రం నిత్యహనన ద్వార పూజలు, ఏకాంతసేవ నిర్వహిస్తారు. జూలై 31న ఉదయం నిత్యహవనాదులు, ధ్వజస్తంభ అభిషేకం, సాయంత్రం నిత్యహవనాదులు, ఏకాంతసేవ జరుగనున్నాయి. ఆగస్టు 1వ తేదీన మహాపూర్ణాహుతి, ధ్వజస్తంభ నిర్మూలన, బింబ, కుంభ, ధ్వజస్తంభ ఉద్వాసనలు, మహానివేదన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

## తొలి ప్రయత్నం నీతోనే ప్రారంభం

### విగతఆత్మ గురించి ఎవ్వరూ ఆలోచించరు : సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి






**కడప పెన్ పవర్ జులై 27 :** ఎవరైనా చనిపోయారు అన్న చావు వార్త మీరు విన్నప్పుడు " నేనేమి చేయగలను " అని అంటారు తప్ప ,ఆవిగతాత్మ గురించి ఎవరూ పట్టించుకోరు.అది ఎక్కడెక్కడ తిరుగుతూ ఉంది? ఏచీకటలో అది కొట్టుమిట్టాడుతూ ఉందో ,ఎన్ని కష్టాల్లో చిక్కుకుని ఉందో ,తాను స్వయంగా మానసికంగా సృష్టించుకున్న ఏభయానక పరిస్థితులను ఎదుర్కుంటోంది అని ఎవరూ ఆలోచించరు.అలా ఎవరైనా ఆలోచించారా?చనిపోయినవారి కోసం మీరు మీ ఇంటికి వచ్చి ఎన్నడైనా విలపించారా? మీరు మీ ఇంటికి వచ్చి మీగురించి ఏడుస్తారు.

**ప్రాణంలేని శరీరాన్ని చూసి భయపడతారు:**

ఉదయం ఒక అర్థగంట , సాయంకాలం 15నిమిషాలు,రాత్రి 15 నిమిషాలు మీరు దీనికి గడపలేకపోతే ఇవన్నీ వృథా! ధ్యానం లేకుండా మిగిలినవన్నీ కూడా వ్యర్థమే.ప్రాణం లేకపోతే ఎంత అందమైన శరీరమైనా,ఎంతటి దృఢమైన శరీరమైనా,ఎంతటి వాంఛనీయ శరీరమైనా,అది కేవలం కుళ్ళి,కంపుకొట్టే తుచ్ఛమైన మాంసపు ముద్దేనని గుర్తుంచుకోండి.శరీరాల కోసం,అలంకరణల కోసం,ఆశరీరం నచ్చే విధంగా ఉంచేందుకు అవసరమైన ఆభరణాలు,అలంకారాలు కోసం కావలసిన డబ్బు కోసం వెంపర్లాడకండి.మీ ఆత్మ మీ శరీరాన్ని విడిచి వెళ్ళిన తక్షణం మీరు మీ దేహాన్ని చూసి జడుసుకుంటారు.జీవించి ఉన్నంతకాలం మీరు కౌగిలించుకుని, ముద్దులతో ముంచెత్తింది మీ భర్తను/భార్యను సైతం అతడు /ఆమె చనిపోయిన క్షణం నుండి తాకడానికి భయపడతారు.భర్తలు/భార్యలు ఈ విషయంలో ఒకటే.రాత్రి శవం ప్రక్కన పడుకోవాలని ఎవరు కోరుకుంటారు?ఎవరికైనా అంత ధైర్యం ఉందా?ఎవరూ అలా చేయరు.భయపడతారు.ఇంతకాలం వారు ఎంతగానో ప్రేమించినవారిని చూసి భయపడతారు.మీరు చనిపోయిన వ్యక్తిని ప్రేమించరు కానీ,మీరు ఇంతకాలం ప్రేమించిన శరీరం ఇంకా అక్కడే ఉన్నప్పటికీ దాన్ని చూసి ఇప్పుడు మీరు భయపడుతున్నారు. మనం ఈ విషయాలపై ఆలోచించాలి.ధ్యానం చేయాలి.పదేపదే నెమరువేసుకోవాలి.నాకు నేను ఏమి చేసుకోవాలి. ఈ సృష్టిలో మిగిలిన వాటికి నేను ఏమి చేయవలసి ఉంది.అందుకే " పరోపకారం ఇంటినుండి ప్రారంభం అవుతుంది" అంటారు.ముందుగా నీవు నీ సంగతి చూసుకో.అప్పుడు నీవు ఇతరులకు సేవ చేయగలవు.

# ఉభయసభల మైనార్టీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం పెన్ పవర్ జులై 27 : అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీలకు సహాయపడే అవకాశం వచ్చింది. ఉభయ సభల సంయుక్త కమిటీల్లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటికి చోటు దక్కింది. తాజాగా రాష్ట్ర శాసనసభ, శాసన మండలికి, ఉభయసభలకు సంయుక్త కమిటీలను నియమించారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజ్ సంయుక్త కమిటీ లను, మండలి చైర్మన్ శాసన మండలి కమిటీలను నియమించారు. 2025–26 సంవత్సరానికి సంబంధించిన వ్యవహారాలను ఈ కమిటీలు పర్యవేక్షించనున్నాయి. ఇందులో మైనార్టీ సంక్షేమ కమిటీలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు చోటు దక్కింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకుల, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతి కోసం పని చేసే అవకాశం వచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. ఈ అవకాశం ఇచ్చిన శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీలు అత్యధిక సంఖ్యలో ఉన్నారని వీరికి సాయం చేసేందుకు ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. వీరి కోసం శక్తివంచన లేకుండా వారి కోసం పని చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## ధర్మవరం డివిజన్లో ఉత్తమ సేవకులకు ప్రశంసా పత్రాలు : జిల్లా ఎస్పీ రత్న




**ధర్మవరం పెన్ పవర్ జులై 27 :** ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో గల పలు పోలీస్ స్టేషన్లలో ఏడు మంది సీఐలు, ఎస్సైలు, ట్రాఫిక్ ఎస్ఐ, కానిస్టేబుల్, ఉమెన్ కానిస్టేబుల్ లతో కలిపి ఏడు మందికి శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న ఉత్తమ విధులు నిర్వర్తిస్తూ, మంచి ఫలితాలను సాధించిన సందర్భంగా ఎస్పీ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ ప్రశంసా పత్రాలను అందుకున్న వారిలో ధర్మవరం టూ టౌన్–సీఐ రెడ్డప్ప, ధర్మవరం రూరల్ స్టేషన్ సిఐ ప్రభాకర్, ధర్మవరం– ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరాముడు, చెన్నై కొత్తపల్లి ఎస్సై .సత్యనారాయణ, ధర్మవరం టూ టౌన్ కానిస్టేబుల్ రాజప్ప, ధర్మవరం టూ టౌన్ ఉమెన్ కానిస్టేబుల్ శ్వేతా రాణి, కనగానపల్లి పోలీస్ స్టేషన్ ఉమెన్ కానిస్టేబుల్ జ్యోతి వారి వారి ప్రశంసా పత్రాలను ఎస్పీ చేతులు మీదుగా అందుకోవడం పట్ల వీరందరూ కూడా ఎస్పీకి కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం ప్రశంసా పత్రాలు అందుకున్న వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రజలకు మరింత సేవలు అందిస్తూ, చట్టపరిటిలో శాంతి భద్రతలకు విఘాతము కలగకుండా తమ వంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. దీంతో ఎస్పీ రత్న వీరందరికీ కూడా ప్రశంసా పత్రాలు అందుకున్న శుభ సందర్భంలో శుభాకాంక్షలు తెలియజేశారు.

## కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

### – జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి – ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం, పెన్ పవర్ జులై 27 :** ఈనెల 28వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి :**

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు.

# సుపరి పాలనలో తొలి అడుగు..





**కడప పెన్ పవర్ జులై 27 :** కడప నగరంలోని 35వ డివిజన్, పెద్ద దర్గా నకాష్ ఎంట్రన్స్ ప్రాంతంలో "సుపరిపాలనలో తొలి అడుగు–ఇంటింటికీ మన ప్రభుత్వం" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ శాఖ మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడు గారు విచ్చేశారు. అలాగే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు రెడ్డెప్ప శ్రీనివాసరెడ్డి ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మరియు శ్రీనివాసరెడ్డి కలిసి కేసీ కెనాల్ క్లీనింగ్ ప్రోగ్రెస్‌ను పరిశీలించారు. అనంతరం, బుగ్గవంక పరిహవాహక ప్రాంతాల్లోని అల్మాస్‌పేట బ్రిడ్జి పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి , కడప క్రికెట్ చైర్మన్ రెడ్డెప్ప గారి శ్రావణ్ రాజ్ రెడ్డి , మన్సూర్ అలీ ఖాన్ కడప సిటీ వైస్ ప్రెసిడెంట్, డివిజన్ ఇంచార్జులు రాఘవ బైరకూరు 35 డివిజన్ , షేక్ జావిద్ భాషా 34 డివిజన్ , షేక్ వాజిద్ భాష 35 సెక్రటరీ ,బూత్ ఇంచార్జి సుబ్బరాయుడు, సెక్రెటరీ, షేక్ సాదక్ భాష,, షైక్ ఇర్ఫాన్, వాసిమ్, సలీం బాషా, ఎంఎల్‌టి షబ్బీర్, అమీన్, ఎంఎల్‌టివసీం,తౌసిఫ్, అఫ్జల్ పాల్గొన్నారు







టీటీడీ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర సీఎస్ కె.విజయానంద్

## 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్.. లంకా దినకర్ 28వ తేదీ కార్యక్రమాలు






**కడప పెన్ పవర్ జులై 27 :** 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ జిల్లా పర్యటనలో భాగంగా ఈ నెల 28వ తేదీ సోమవారం ఆయన రోడ్డు మార్గాన కడప నుండి ఉదయం 9 గంటలకు బయలుదేరి 11 గంటలకు గండికోట చేరుకోనున్నారు. 11 గంటల నుండి 12 గంటల మధ్య వరకు గండికోట ఫోర్ట్, పెన్నా నది ప్రాంతాలను సందర్శించనున్నారు. అనంతరం తిరిగి రోడ్డు మార్గాన కడపకు చేరుకొని 3 గంటల నుండి 5 గంటల వరకు కలెక్టరేట్లో ఆకాంక్షిత జిల్లా అంశంపై జిల్లా కలెక్టర్,వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం ఆయన విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నారు.

### ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం, స్ఫూర్తిదాయకం

– డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



కడప పెన్ పవర్ జూలై 27 : మాజీ భారత రాష్ట్ర పతి,భారత క్షిపణి పితామహుడు,భారత రత్న బిరుదాంకితుడు స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాం 10 వ వర్ధంతిని వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మాట్లాడుతూ కలాం నిరాడంబరతకు,నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు. ఆయన నిత్య విద్యార్థి.అందుకే ఆయన పుట్టిన రోజు అయిన అక్టోబర్ 15 ను ప్రపంచ విద్యార్థి దినంగా ఐక్య రాజ్య సమితి ప్రకటించింది. స్వయం కృషి,స్వీయ ప్రతిభ తో ఒక సామాన్యుడు మాన్యుడు,అసామాన్యుడు కాగలడని,ఒక పేపర్ బాయ్ శాస్త్ర వేత్త కాగలడని, ఒక రామేశ్వరం బాలుడు రాష్ట్ర పతి కాగలడని కలాం నిరూపించారు. కలలు కనండి – వాటిని సాకారంచేసుకోండి అని అబ్దుల్ కలాం ఇచ్చిన అమర సందేశం ప్రపంచ వ్యాప్తంగా యువతకు తారక మంత్రంగా పని చేసింది. కలాం జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకం, మార్గదర్శకం అని తులసి రెడ్డి కీర్తించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం,వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్,వేమా రాజా, బద్రి నాథ్, హన్సికా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రంగ స్వామి గుండంలోకి జాలువారుతున్న గుండ్లకమ్మ



**గిద్దలూరు పెన్ పవర్ జులై27 :** రాచర్ల మం.లోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ నెమలి గుండ్ల రంగస్వామి దేవస్థానం వద్ద నీటి గుండంలోకి ఎత్తయిన కొండల నుండి గుండ్లకమ్మ నది నెమలి గుండంలోకి జలపాతంలా జాలువారుతూ జల కళ సంతరించుకుంది. గత రెండు రోజుల నుంచి నల్లమల అతివిలో కురుస్తున్న వర్షాలకు గుండ్లకమనదికి వరద వచ్చి పొంగి పొర్లుతూ నెమలిగుండం లోకి ఎతైన కొండనుండి జాలువారుతూ కనువిందు చేస్తుంది. గుండ్లకమ్మ నది గుండ్ల బ్రహేశ్వరం వద్ద పుట్టి నలమల్ల కొండకొనల్లో ప్రవహిస్తూ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయం చెంత ఎతైన కొండల మధ్య నుంచి పేద శబ్దం చేస్తూ జలపాతంగా జాలువారి భూమార్గం లో పయనించి పలు ప్రాంతాల్లో భూముల సస్యశ్యామలం చేస్తూ చివరకు సముద్రంలో కలుస్తుంది. నెమలిగుండ్ల రంగనాయక స్వామి చెంత జలపాతంలా గుండంలోకి దుముకుతుండటంను తిలకించేందుకు పర్యాటకులు భారీగా తరలి వస్తున్నారు. ఈ జలపాతం వద్ద పోలీస్ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# గిరిజన సాంప్రదాయ పద్ధతిలో పర్యాటకులకు విడిది సౌకర్యం



● గిరిజన పర్యాటక అభివృద్ధి మేనేజర్ జి. దాసు

**చింతపల్లి పెన్ పవర్ జూలై 27:-** పర్యాటక ప్రాంతాల్లో సాంప్రదాయ పద్ధతిలో వసతి సౌకర్యం కల్పించడంతో పాటు గిరిజనులకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ గరికన దాసు అన్నారు. మండలంలో గల పర్యాటక ప్రాంతాలైన లంబసింగి , తాజంగి పంచాయతీలలో పలు గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక ప్రాంతాలైన మారేడుమిల్లి ,లంబసింగి, అరకు ప్రాంతాల్లో ట్రైబల్ హోమ్ స్టే పేరిట ప్రాచీన గిరిజన సాంప్రదాయ పద్ధతుల్లో విడిది చేయడానికి ఏర్పాట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కార్యాచరణరూపొందించాయని తెలిపారు. ఇందులో భాగంగా పర్యాటక ప్రాంతాలైన చీకటి మామిడి, రింగుడు మెట్ట, లంబసింగి, బంతి బయలు ,భీమనాపల్లి లబ్బంగి తాజంగి రిజర్వాయర్ తాజాగా ఎంపిక చేసిన గ్రామాలలో ఐదు నుండి పది గృహాలను గుర్తించి గృహ యజమానుల ఆసక్తి మేరకు హోం స్టేలుగా మార్పు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గిరిజనుల ఆసక్తి మేరకు విడిది గృహంలో పర్యాటకులకు అన్ని మా మౌలిక సౌకర్యాల కల్పనకు ఒక్కొక్క ఇంటికి రెండు నుండి మూడు లక్షల వ్యయం చేయనున్నట్లు ఆయన తెలిపారు . ఈ వసతి గృహంలో వచ్చే ఆదాయం గృహ యజమానులకు వర్తిస్తుంది అన్నారు. గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి కొంతమేర సహాయ పడాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే మారేడుమిల్లిలో సర్వే పూర్తి అయిందని అరకు లో ఈ సర్వేను సోమ,మంగళవారం లో చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పర్యాటక సీజన్ నాటికి ఈ హోం స్టేలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ ఆర్కిటెక్ నిషిత గోయల్, డి ఈ పి. రాము, లంబసింగి రిసార్ట్ మేనేజర్ అప్పలనాయుడు, లంబసింగి, తాజంగి సర్పంచులు కొర్ర శాంతి కుమారి, వంతల మహేశ్వరి, వైసిపి నాయకులు మాజీ సర్పంచ్ కుర్రా రఘునాథ్, దేపూరి గిరి, నూకరాజు, సరమండ నాగరాజు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూటమి సమన్వయ కమిటీల ఏర్పాటు అవసరం

### మధుకర్‌జి కి బోండ్ల చిరంజీవి వినతి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 27:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కూటమి సమన్వయ కమిటీల ఏర్పాటు అవసరమని బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుకర్ జీకి బీజేపీ నేత బోండ్ల చిరంజీవి విజ్ఞప్తి చేశారు.ఆయన మధుకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఈ మేరకు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, "మా రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ సూచించినట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిగా పోటీ చేయాలని బీజేపీ సిద్ధంగా ఉంది. గత ఎన్నికల్లో మేము పోటీ చేసిన ఎంపిటిసి, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను మళ్లీ కోరే ఆలోచన ఉన్నప్పటికీ, కూటమి వ్యూహంలో భాగంగా కొన్ని స్థానాల్లో సమన్వయం అవసరం అవుతుంది," అని అన్నారు."ప్రస్తుతం గిరిజన గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో 60 శాతం అభివృద్ధి జరుగుతోంది. రాష్ట్ర పథకాలతో 40 శాతం అభివృద్ధి చోటు చేసుకుంటోంది. అయినప్పటికీ స్థానిక సంస్థలపై అధికారం లేకపోవడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు పూర్తిగా చేరడం లేదు. అందువల్ల స్థానిక స్థాయిలో కూడా అధికార మార్పు అవసరం. కూటమిగా గెలిచి స్థానిక సంస్థల్లో అధికారంలోకి రావాలంటే సమన్వయ కమిటీల ఏర్పాటు అత్యంత అవసరం," అని ఆయన తెలిపారు."ఈ విషయాలను పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తెలిపాను. సమన్వయంతో కూడిన వ్యవస్థ ఏర్పాటయితే కూటమికి విజయావకాశాలు మెరుగవుతాయని నా అభిప్రాయం," అని చిరంజీవి పేర్కొన్నారు.ద

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎం.వి.ఎస్ ప్రసాద్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 27**:సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం సందర్భంగా గూడెం కొత్తవీధి మండలం దేవరాపల్లి గ్రామంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులతో రాష్ట్ర పార్టీ కార్యదర్శి, మాజీ జి.సి.సి చైర్మన్ ఎం.వి.ఎస్ ప్రసాద్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, "ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలవుతున్న ప్రస్తుత దశలో ప్రజలకు ఆ వివరాలు చొచ్చినట్టు తెలియజేయడం కార్యకర్తలు, నాయకుల బాధ్యత. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో మీరు కీలక పాత్ర పోషించాలి," అని దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో మండల కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్, గ్రామ కమిటీ సహాయ కార్యదర్శి లక్ష్మణరావు, సీనియర్ నాయకులు రాజారావు, రామకృష్ణ పాల్గొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలపడేలా చర్యలు తీసుకోవాలని మరియు ప్రజలలో విశ్వాసం పెరిగేలా కార్యకలాపాలు నిర్వహించాలని నాయకులకు సూచించారు.

## లోతేరు సచివాల సిబ్బందికి ఘన సన్మానం.



**పెన్ పవర్, జూలై 27**:అల్లూరి జిల్లా అరకులోయ మండలం లోతేరు గ్రామపంచాయతీ సచివాలయం సిబ్బందికి ఆదివారం గ్రామస్తులు ఘన సన్మానం నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సర్పంచ్ గుబాయి కళావతి ఆధ్వర్యంలో లోతేరు గ్రామపంచాయతీ ప్రజలు సచివాలయం సిబ్బందికి ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. సర్పంచ్ గుబాయి కళావతి పంచాయతీ కార్యదర్శి, వార్డు మెంబర్స్, గ్రామ ప్రజల సమక్షంలో సచివాలయ సిబ్బందికి పూల బొకేలు ఇచ్చి, దుస్సాలువలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు మరింత సేవలు అందించాలని మనం చేస్తున్న వృత్తి ఇష్టంగా చేయాలని దృఢ సంకల్పంతో ప్రజలకు మమేకమై, బదిలీపై ఎక్కడ వెళ్ళినా ప్రజలకు సేవచేసి, ఎక్కడ పనిచేసిన మంచి పేరు తెచ్చుకొవాలనీ, ప్రజల శ్రేయస్సు కోసం పని చేయాలని సర్పంచ్ కలావతి గ్రామస్తులు ఆదివారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ గోపీనాథ్,సచివాలయ సిబ్బంది వార్డ్ నెంబర్ రోస్య , నాగేష్, రామ్మూర్తి, పంచాయతీ ప్రజలు పట్టాసి కొండలరావు, పాంగి కోగేశ్వరరావు , గుబాయి త్రినాథ్ స్వామి, మోహన్, భీమ,అప్పలరాజు వార్డు మెంబర్స్, గ్రామ పెద్దలు, ప్రజలు, పిసా కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్రకు పెద్దపీట వేయడం



● ఉత్తరాంధ్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం.
● తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్ బాబు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జులై 27** :ఉత్తరాంధ్రకు సరైన గుర్తింపు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుంది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెనుకబడిన ఉత్తరాంధ్రకు పెద్దపీట వేయడం జరిగింది.మన్యం ప్రాంతంలో మారుమూల ప్రాంతాలలో కూడా రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగింది.ఉత్తరాంధ్రలో రాజకీ యంగా నాయకులకు సరియైన గుర్తింపునిచ్చి సముచిత స్థానం కల్పించడం జరిగింది.గత వైసిపి ప్రభుత్వ బానిస సంకెళ్ల నుంచి స్వేచ్ఛ ప్రజా పాలనకు బాటలు వేయడం జరిగింది.

విశాఖ కేంద్రంగా ఐ టి హబ్, మరెన్నో కొత్త పరిశ్రమలను ఆహ్వానించి ఉత్తరాంధ్ర యువత కు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభు త్వం ముందుకు సాగుతుంది.గత పాలకులు ఉత్తరాంధ్రను అభివృద్ధి కాకుండా, ఉత్తరాంధ్రలో ఉన్న వనరులను దోచుకొని ఉత్తరాంధ్రకు వైసిపి తీరని అన్యాయం చేసింది.ఉత్తరాంధ్రను తమ సొంత జాగీరుగా సాయి రెడ్డి, వైవి సుబ్బారెడ్డి వంటి సామంత రాజులను దిగుమతి చేసి ఉత్తరాంధ్ర నాయకులకు వైసీపీ చిన్న చూపు చూసింది.కానీ కూటమి ప్రభుత్వంలో అశోక్ గజపతిరాజు ని గోవా గవర్నర్ గా, రామ్మోహన్ నాయుడుని కేంద్ర మంత్రిగా, పల్లా శ్రీనివాస్ ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉత్తరాం ధ్ర నాయకులకు సముచిత స్థానం కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. గతంలో ఆంధ్ర యూనివర్సిటీ కి బానిసత్వం చేయడానికి పాద సేవకు వచ్చిన వైసిపి నాయకులు నేటి ప్రజా ప్రభుత్వంలో స్వేచ్ఛగా సమస్యలపై చర్చించేం దుకు వస్తున్నారు.రానున్న కాలంలో ఉత్తరాం ధ్రకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుంది.ఉత్తరాంధ్ర పై వైసీపీ ది సవతి తల్లి ప్రేమ అయి తే, కూటమి పార్టీలు కన్నతల్లిలా ఆదరిస్తున్నాయి.ఉత్తరాంధ్రలో గతంలో హుదూద్,తిత్లి వంటి తుఫానులతో అతలాకుతలమైతే చంద్రబాబు గారు ఎంతో పట్టుదలతో ఒక రూపం తీసుకుని వచ్చారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్, విశాఖ మెట్రో, కేంద్రీయ విద్యాసంస్థలు కోస్టల్ కారిడార్ వంటివి శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది. చంద్రబాబు నాయకత్వంలో ఉత్తరాంధ్రను మరింత ముందుకు తీసుకుని వెళ్తాం.

## చింతపల్లి లో నృత్య కళాకారులకు ఐడెంటి కార్డులు పంపిణీ





**చింతపల్లి పెన్ పవర్ జూలై 27:-** అల్లూరి జిల్లా నృత్య కళాకారుల సంఘంఆధ్వర్యంలో జిల్లా కళాకారుల యూనియన్ సభ్యులందరూ సభ్యులందరూ ఈరోజు ఆదివారం నాడు చింతపల్లి మార్కెట్ యార్డ్ నందు కళాశాల అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కళాకారుల బృందం నాయకులు జిల్లా అధ్యక్షులు సీనియర్ కొరియోగ్రాఫర్ మాస్టర్ భరత్ పాల్గొని కుటుంబ సభ్యులతో మమేకమై కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడుతూ కుటుంబం కోసంమాట్లాడుతూ కుటుంబంలో అందరూ కూడా కలిసిమెలిసి మమేకమై యూనియన్ నిర్ణయాన్ని కట్టుబాటుతో ఉండాలని లేనియెడల యూనియన్ కుటుంబ సభ్యులు అటువంటి వారిపై సభ్యులు తగు చర్యలు తీసుకోబడతాయని, అలాగే ముఖ్యంగా అల్లూరి జిల్లా కళాకారుల యూనియన్ సభ్యుల యొక్క ముఖ్య సభ్యుల యొక్క నిర్ణయాలు తీసుకోకుండా మన వాళ్ళ ఇతర ప్రదేశాల నుంచి వచ్చి ప్రోగ్రామ్స్ చేసిన వాళ్లకు వాళ్లపై తగు చర్యలు తీసుకోబడునని సమావేశ యొక్క సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది అంతేకాకుండా అన్నిటికంట ముఖ్యంగాఅల్లూరి జిల్లాలో ఉన్న ప్రతి కళాకారుల కుటుంబ సభ్యులకు రెండు లక్షల ఇన్సూరెన్స్ కళాకారుల ప్రతి ఒక్క కుటుంబ సభ్యుల సహకారాలతో ప్రతి ఒక్క కళాకారులకి రెండు లక్షలు హెల్త్ ఇన్సూరెన్స్ ఇచ్చుటకు నిర్ణయించడం జరిగింది అలాగే గౌరవ అధ్యక్షులు భారత్ చేతుల మీదుగా ఐడి కార్డులు డిస్ట్రిబ్యూషన్ జరిగింది యొక్క కార్యక్రమంలో గౌరవ ప్రెసిడెంట్ అశ్విన్ వైస్ ప్రెసిడెంట్ రాము వర్కింగ్ ప్రెసిడెంట్ మోరి రవి కుటుంబ సభ్యులందరూ పాల్గొనడం జరిగింది

## గిరిజన రైతులకు సకాలంలో విత్తనాలు అందించాలి

### జిల్లా పరిషత్తు సమావేశంలో జడ్పిటిసి పోతురాజు బాలయ్య





**చింతపల్లి పెన్ పవర్ జూలై 27:-** విశాఖపట్నంలో జరిగిన ఉమ్మడి జిల్లా జిల్లా పరిషత్ మూడవ స్థాయి సంఘం అయిన వ్యవసాయ స్థాయి సంఘం సమావేశం లో గిరిజన రైతుల సమస్యల పై గళం విప్పిన చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య ముఖ్యం గా గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు వ్యవసాయం మీదనే ఆధారపడిన జీవనం సాగిస్తున్నారు.ప్రభుత్వం నుండి వచ్చే రాయితీ విత్తనాలు ఎరువులు అరకొరగా రావడం వలన రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.ఈ సంవత్సరం వరి విత్తనాలు అరకొరగా రావడం వలన రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు.దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికారులు రాజమా విత్తనాలు పూర్తి స్థాయిలో రైతులందరికీ అందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈసందర్భం గా ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేస్తూ చింతపల్లి, గూడెం కొత్తవీధీ మండలాల లో రాజమా పండించే విస్తీర్ణం ఎక్కువగా ఉందనీ దానికి సరిపడా విత్తనాలు అందక రైతులు చాలా నష్ట పోతున్నారు అని అన్నారు.ఈ సంవత్సరం అయినా గతంలో పంపిణీ చేసిన విత్తనాల కంటే ఎక్కువ విత్తనాలు సరఫరా కు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి రైతులు లందరికీ రాజ్మా విత్తనాలు అందిస్తామని హామీ ఇచ్చారు.నాణ్యమైనా విత్తనాలు సరఫరా చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అన్నారు.మినుములు,పెసలు ఉలవ విత్తనాలు కూడా రాయితీ పై అందించాలని కోరారు.అలాగే మొక్కలు నాటడానికి గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నారు.దానికి అనుగునంగా ఉద్యాన శాఖ అధికారులు పారెస్టు అధికారులు మొక్కలు సరఫరా చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.ఈ సంవత్సరం ఫారెస్ట్ అధికారులు పెంచిన నర్సరీలలో మొక్కలు హాట్ కేక్ లా ఎగిరి పోయాయి అన్నారు.దీనిబట్టి మొక్కలు పెంచడానికి రైతులు ఎంత ఆసక్తిగా ఉన్నారనడాని ఇదే నిదర్శనం అన్నారు.అధికారులు ఇప్పటి నుండే తగు ప్రణాళికలు తయారు చేసుకొనీ వచ్చే సంవత్సరం లో పెద్ద ఎత్తున మొక్కలు సరఫరా కు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.దీనివలన అడవులు పెరిగి పర్యావరణం కాపాడగలిగినవారమైతామనీ అన్నారు.ఈసమావేశంలో మూడవ స్థాయి సంఘం అధ్యక్షుడు గిరిబాబు, సభ్యులు దొండా రాంబాబు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జె రాళ్లగడ్డ గ్రామంలో భారీ వర్షానికి కూలిన ఇల్లు గోడ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 27:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షలకు జర్రెల పంచాయతీ పరిధిలోని జే.రాళ్లగడ్డ గ్రామంలో లోత బాలయ్య అనే గిరిజనుడికి చెందిన రేకుల ఇల్లు గోడ ఆదివారం సాయంత్రం కూలిపోయింది.ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికలు తెలిపారు. ఆశ్రయం కోల్పోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వ అధికారులే గుర్తించి ఆదుకోవాలని బాధితుడు బాలయ్య కోరుతున్నారు.

# పదిమంది పిఎసిఎస్ చైర్మన్ లకు ఘనంగాప్రమాణస్వీకారలు

## రాష్ట్ర హెూం మంత్రి అనిత ఎంపీ సీఎం రమేష్ ల ఆధ్వర్యంలో



**పాయకరావుపేట,పెన్ పవర్, జూలై 28:** రాష్ట్ర హెూమ్ మినిస్టర్ వంగలపూడి అనిత మరియు అనకాపల్లి పార్లమెంటు సభ్యులు ఎంపీ సీఎం రమేష్ ల ఆధ్వర్యంలో ఘనంగా పదిమంది పిఎసిఎస్ చైర్మన్ లకు సన్మాన మహెూత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు వారికి
10 మంది పిఎసిఎస్ చైర్మన్లకుశు భాకాంక్షలు తెలిపారు అదే విధంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఎన్డియే కూటమి ప్రభుత్వంలో కష్టపడిన వారికి నామినేటేడ్ పదవులు వచ్చాయన్నారు.పని చేసిన కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు ఉంటుంది.ఒకప్పుడు వ్యవసాయం అంటే రైతులకు కష్టంగా ఉండేది.

ఇప్పుడు ఎన్డియే ప్రభుత్వంలో రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం.అతి తక్కువ వడ్డీలతో రైతులకు రుణాలు ఇస్తున్నాం.విత్తనాలు,ఎరువులు కూడా రైతులకు పంపిణీ చేస్తున్నాం.ఆర్గానిక్ వ్యవసాయం చేసే రైతుల సంఖ్య కూడా పెరుగుతుంది.రాజకీయాల్లో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం.సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు.గత ప్రభుత్వంలో పాయకరావుపేట నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు.2029 నాటికి పాయకరావుపేటలో స్టీల్ ఫ్లాంట్ రన్నింగ్ లోకి వస్తుంది.పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు రానున్నాయి.ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్నాం.సీఎం చంద్రబాబు పెట్టుబడులు కోసం సింగపూర్ వెళ్ళారు.సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కష్టపడతున్నారు.ఇప్పుడు ఎవ్వరిని అక్రమంగా అరెస్ట్ లు చేయడం లేదు.చంద్రబాబు పర్యటిస్తే,పరదాలు కట్టడం లేదు.ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నామని చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు





తదితరులు పాల్గొన్నారు.

# బస్ షెల్టర్ ఆవరణలో శ్రమధానంతో చెత్తాచెదారం తొలగింపు




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 27:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం రింతాడా పంచాయతీ పరిధిలోని ఏబులం గ్రామ బస్ షెల్టర్ పరిసర ప్రాంతాల్లో కొంతకాలంగా చెత్తాచెదారం, పిచ్చి తుప్పలు గడ్డి, పేరుకుపోయి అసౌకర్యాన్ని కలిగించేస్తున్నదని గమనించిన జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు పేసా కమిటీ సభ్యులు గబులంగి గణేష్ , తక్షణమే ప్రజలతో కలిసి శ్రమధానం చేపట్టారు.బస్ షెల్టర్ ప్రాంగణంతో పాటు, కాంప్లెక్స్ ఆవరణలో పేరుకున్న చెత్తను గ్రామస్తుల సహకారంతో పూర్తిగా శుభ్రం చేశారు. వర్షాకాలంలో ప్రజలు బస్సుల కోసం నిరీక్షించే స్థలమైతే, చెత్తతో నిండిపోయి తీవ్రమైన అసౌకర్యాన్ని కలిగించడంతో, సమస్యను స్వయంగా పరిశీలించి పరిష్కరించారు.ఈ శ్రమధాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు వీరభద్రరావు, రామచంద్రరావు, తిరుపతి, రాజు, బాబురావు తదితరులు పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. గ్రామస్థుల సంఘీభావంతో ఈ కార్యక్రమం విజయవంతమై, స్వచ్ఛ గ్రామ లక్ష్య సాధనలో కీలక ముందడుగైంది."ప్రతి ఒక్కరు తమ గ్రామం శుభ్రంగా ఉండేందుకు చొరవ చూపాలి. ఇది సామూహిక బాధ్యత" అని గబులంగి గణేష్ ఈ సందర్భంగా తెలియజేశారు.

# హామీలు విస్మరించడం తో చంద్ర బాబు పై ప్రజలు ఆగ్రహం

- ఏడాది లోనే కూటమి ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత కె.కె రాజు







**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, జులై 27. :**విశాఖ ఉత్తర నియోజకవర్గం 46వార్డు స్థాయి లో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' అనే కార్యక్రమం 46వ వార్డు శాంతినగర్ నూతన ఫంక్షన్ హాల్ లో వార్డు అధ్యక్షుడు బలిరెడ్డి గోవింద్, ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజ కవర్గ సమన్వయ కర్త కె.కె.రాజు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ వార్డ్ కార్పొరేటర్ కట్టమూరి సతీష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఇప్పుడు హామీలు అమలు చేయకుండా,ప్రజలకు చంద్రబాబు చేస్తున్న మోసాలను, రెడ్ బుక్ రాజ్యాంగా అరాచకలను ప్రజలకు తెలియజేసి వారిని చైతన్య పరచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పిన పథకాలు అమలుచేసి ప్రజలకు సంక్షేమం అంటే ఏమిటో చేసి చూపించారు అని అన్నారు.

చంద్రబాబు ఏడాది కాలంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని తెలిపారు , సూపర్ సిక్స్, బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీలి అంటూ ప్రజలను నమ్మించి ఓట్లు దండుకొని పథకాలు అమలు చేయకుండా పేదల జీవితా లు తో ఆడుకుంటున్నారు అని తెలిపారు..

చంద్ర బాబు నాయుడు ఎప్పుడూ అధికారం లోకి వచ్చిన ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు...

అనంతరం 2024 ఎన్నికల్లో కూటమి నాయ కులు ప్రజలకు ఇచ్చిన అబద్ధపు హామీలను, చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు స్క్రీన్ మీద వీడియో రూపంలో వివరించి , కూటమి ప్రభుత్వము అమలకాని హామీలు ఇచ్చిన బాబు షూరిటీ - మోసం గ్యారంటీ పేరుతో ఉన్న కరపత్రాన్ని పార్టీ నాయకులు తో కలిసి ఆవిష్కరించారు

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు, సేనాపతి అప్పారావు, పామేటి బాబ్జి మరియు దూది నర్సింగరావు, కొరువాడ చిన్న లావణ్య, బొట్ట రాజు, శ్రీను, ఈశ్వర రావు, రామారావు, కోట రామారావు, సీతయ్యరెడ్డి, అప్పిరెడ్డి, జి.అప్పారావు, దుర్గాభవాని, ఎం.వి రమణ, గ్రామ సభ్యులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, బూత్ సభ్యులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# వై గొంది పల్లి గ్రామంలో డస్ట్ బిన్లు పంపిణీ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 27:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జీకే వీధి పంచాయతీ వై గొందిపల్లి గ్రామంలో చెత్త సేకరణలో భాగంగా స్థానిక ఉపసర్పంచ్ కొర్ర రాంబాబు ఆధ్వర్యంలో డస్ట్ బీన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు, పరిసరాల పరిశుభ్రత కు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని అన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ ఉండాలని వివరించారు. అలాగే వర్షాకాలం కనుక ప్రజలు ఆరోగ్యం పట్ల మెలుకువగా ఉండాలని సూచించారు.

# అందరికీ ఉన్నత విద్య





**గాజువాక: పెన్ పవర్ జూలై 27** బీసీ రోడ్డు గాజువాక కాకతీయ గేట్ వద్ద ఝాన్సీ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో అందరికీ ఉన్నత విద్య అందించాలని సంకల్పముతో విద్యార్థులకు పుస్తకాలు బ్యాగులు ఝాన్సీ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ వానపల్లి శ్రీనివాస రావు అధ్యక్షతన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక సర్కిల్ ఇన్స్పెక్టర్ పార్థసారథి, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు,65 వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు,వైయస్సార్ సీనియర్ నాయకులు మాజీ వరాహ నరసింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ దొడ్డి రమణ,టిడిపి నాయకుడు పప్పు రాజా రావు, డాక్టర్ కె.వి.ఎస్ కళ్యాణ్ సింహగిరి హాస్పిటల్, ప్రముఖ న్యాయవాది పెంటకోట నాగేశ్వరరావు, 65వ వార్డు అధ్యక్షుడు రెడ్డి వాసు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు వారి చేతుల మీదుగా పుస్తకాలు బ్యాగులు ఉచితంగా అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉన్నత విద్య విద్యార్థులకు ఎంత అవసరమని దీనివల్ల సమాజానికి ఉపయోగం, వాళ్లకి గౌరవ మర్యాదలు లభిస్తుంది అన్నారు. గత 14 సంవత్సరాలుగా ఎంతో మందికి ఉన్నత విద్యను అందించడంలో సహకారం అందిస్తున్నారు ఎంతమందికి మంచి స్థానంలో ఉన్నారని అని అన్నారు సంస్థ ఫౌండర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు 9500 మంది విద్యార్థులకు మా సంస్థ ద్వారా ఉన్నత చదువులు చదివించమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కుమార్, ఝాన్సీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పదిమంది పిఎసిఎస్ చైర్మన్ లకు ఘనంగాప్రమాణస్వీకారలు







- రాష్ట్ర హెూం మంత్రి అనిత ఎంపీ సీఎం రమేష్ ల ఆధ్వర్యంలో

**పాయకరావుపేట,పెన్ పవర్, జూలై 28:** రాష్ట్ర హెూమ్ మినిస్టర్ వంగలపూడి అనిత మరియు అనకాపల్లి పార్లమెంటు సభ్యులు ఎంపీ సీఎం రమేష్ ల ఆధ్వర్యంలో ఘనంగా పదిమంది పిఎసిఎస్ చైర్మన్ లకు సన్మాన మహెూత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు వారికి

10 మంది పిఎసిఎస్ చైర్మన్లకుశుభాకాంక్షలు తెలిపారు అదే విధంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఎన్డియే కూటమి ప్రభుత్వంలో కష్టపడిన వారికి నామినేటేడ్ పదవులు వచ్చాయన్నారు.పని చేసిన కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు ఉంటుంది.ఒకప్పుడు వ్యవసాయం అంటే రైతులకు కష్టంగా ఉండేది.

ఇప్పుడు ఎన్డియే ప్రభుత్వంలో రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం.అతి తక్కువ వడ్డీలతో రైతులకు రుణాలు ఇస్తున్నాం.విత్తనాలు,ఎరువులు కూడా రైతులకు పంపిణీ చేస్తున్నాం.ఆర్గానిక్ వ్యవసాయం చేసే రైతుల సంఖ్య కూడా పెరుగుతుంది.రాజకీయాల్లో యువతకు అధిక ప్రాదాన్యత ఇస్తున్నాం.సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు.గత ప్రభుత్వంలో పాయకరావుపేట నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు.2029 నాటికి పాయకరావుపేటలో స్టీల్ ప్లాంట్ రన్నింగ్ లోకి వస్తుంది.పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు రానున్నాయి.ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్నాం.సీఎం చంద్రబాబు పెట్టుబడులు కోసం సింగపూర్ వెళ్ళారు.సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కష్టపడతున్నారు.ఇప్పుడు ఎవ్వరిని అక్రమంగా అరెస్ట్ లు చేయడం లేదు.చంద్రబాబు పర్యటిస్తే,పరదాలు కట్టడం లేదు.ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నామని చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ...



**కురుపాం, పెన్ పవర్, జూలై -27.**కురుపాం నియోజక వర్గం గుమ్మ లక్ష్మీపురం మండలం లోని గోయపాక, జియ్యమ్మ వలస మండలం బిత్రపాడు గ్రామాల్లో ఈ మధ్య కాలంలో మరణించిన బాధిత కుటుంబాలను మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీ వాణీ ఆదివారం పరామర్శ చేశారు. మృతి కి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటానని బరోసా నిచ్చారు. ఈ పరామర్శ లో మండల కన్వీనర్, సర్పంచ్ లు ఎంపీటీసీ లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ మరిడిమాంబ అమ్మవారి మహెూత్సవం




ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జులై 27 :** డాబా గార్డెన్స్ ,కనకల వీధి వద్ద శ్రీ శ్రీ శ్రీ మరిడి మాంబ అమ్మవారి మహెూత్సవం లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాన్స్ బేబీ షో కార్యక్రమాన్ని కాసేపు అభిమానులు తో కలిసి తిలకించా రు .అనంతరం అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదగా బహుమతులు అందజేశారు.చివరిగా ఎమ్మెల్యే కి శాలువా వేసి , అమ్మవారి చిత్రపటం అంద జేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవం లో పాల్గొనే అవకాశం కల్పించిన కమిటీ సభ్యుల కు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన ,బిజెపి నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

# అమ్మా నాన్న అనాధాశ్రయం లో కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ జన్మదిన వేడుక



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూలై 27:**13వ వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ జన్మదిన వేడుక ఆరిలోవ లో గల అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ వృద్ధుల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ దంపతులు ఆశ్రమంలో వారి మధ్య కేక్ కట్ చేసి అనంతరం వృద్ధులకు పండ్లు బిస్కెట్లు స్వీట్స్,బ్రెడ్ మొదలైనవి పంపిణీ చేశారు.వృద్ధుల మధ్య తన జన్మదిన వేడుక జరుపుకోవడం ఆనందాన్నిచ్చిందని వారీ ఆశీస్సులు అందించడం సంతోషాన్ని కలిగించిందని ఆమె తెలిపారు.కార్యక్రమంలో దారపాలెం అసోసియేషన్ సభ్యులు చంద్రమౌళి వర్మ రాజు. మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు వడిసెలశ్రీను ఆనందరావు కళ్యాణి.కేశవరావు,రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ ఎమ్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలో ప్రారంభం





**గాజువాక: పెన్ పవర్, జూలై 27:**విశాఖ జిల్లా,గాజువాక నియోజకవర్గం,75వ వార్డ్ ఉక్కు నిర్వాసితుల క్రీడా మైదానంలో పెదగంట్యాడ శెట్టి బలిజ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్పీఎమ్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్- 4 టోర్నమెంట్ ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు మరింతగా ఉపయోగపడేలా క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. నేటి యువత క్రీడలపై ఎక్కువగా మక్కువ చూపాలన్నారు.నిర్వాసిత కోలనీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా కాసేపు బ్యాట్ పట్టుకొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు,జిల్లా తెలుగు యువత ప్రధానకార్యదర్శి మొల్లి పెంటిరాజు,జిల్లా నాయకుడు పులి రమణారెడ్డి,జనసేన నాయకుడు కోన చిన అప్పారావు,వార్డ్ అధ్యక్ష,కార్యదర్శులు లు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య,క్లస్టర్ ఇంచార్జి ఉరుకూటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు నుంచి పండగే.. బాబు కానుకల వెల్లువ.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆగస్టు నెల నుంచి రాష్ట్రంలో మరిన్ని సంక్షేమ పథకాల అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అంటే ఒక రకంగా ఇది ఏపీలో పండగ వాతావరణం తీసుకురావడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రధానంగా ఆగస్టు 15 తారీకు నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే చంద్రబాబు అన్ని సిద్ధం చేసుకున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రంలో మహిళలకు ఉచితంగా సౌకర్యం కల్పిస్తామని మంత్రి అచ్చం నాయుడు కూడా ప్రకటించారు. పల్లె వెలుగు, డీలక్స్, ఎక్స్ప్రెస్ తో పాటు మరో రెండు రకాల బస్సులను కూడా మహిళల ప్రయాణానికి అనుమతించనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. దీనివల్ల మహిళల సంతృప్తిని కూటమి వైపు పెంచుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. మరోవైపు రైతులు గత కొన్నాళ్లుగా ఎదురుచూస్తున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా వచ్చే నెల నుంచి ప్రారంభించనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. ఇది, ఆగస్టు తొలి వారంలోనే ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. వాస్తవానికి 13 నెలలుగా అన్నదాతలు ఈ పథకం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ కూడా ప్రారంభం అయిపోయింది. అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వం ఇచ్చే సాయం కోసం ఎదురుచూస్తున్నారు అన్నది వాస్తవం. వాస్తవానికి గత ఏడాది దీన్ని అమలు చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం మారడం, అదేవిధంగా రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగాకపోవడం కారణంగా ఈ పథకాన్ని వాయిదా వేశారు. వచ్చే నెలలో దీన్ని అమలు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించడం ఆశలు రేకెత్తిస్తోంది. ఇది ఎంతవరకు సక్సెస్ అవుతుంది అనేది చూడాలి. ఇక, ఆగస్టు నెల నుంచే వితంతు పింఛన్లను పునరుద్ధరిస్తామని ప్రభుత్వం తెలిపింది. అంటే వైసిపి హయంలో కొందరికి వితంతు పింఛన్లు తీసేశారు. వాటిని తాము మళ్ళీ పునరుద్ధరిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇది కూడా మంచి కార్యక్రమం అని చెప్పాలి. అలాగే ఆగస్టు 15 తారీకు నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా అన్ని సేవలను ఆన్లైన్లో పొందే విధంగా వాట్సాప్ సేవలను మరింత విస్తృతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది కూడా ప్రజల్లో మంచి మార్కులు వేయించుకునే అవకాశం కనిపిస్తుంది. అదేవిధంగా వచ్చే నెల నుంచి ప్రజల మధ్యకు చంద్రబాబు రానున్నారు. తొలుత పట్టణాలు, తర్వాత గ్రామీణ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ప్రజలను కలుసుకునే అవకాశం కనిపిస్తుంది. మొత్తంగా ఆగస్టు నుంచి రాష్ట్రంలో ఒక భిన్నమైనటువంటి పరిస్థితి, భిన్నమైన వాతావరణం స్పష్టంగా కనిపించనున్నాయి. ఇది ప్రభుత్వానికి మేలు చేస్తుందని అధికార వర్గం అంచనా వేస్తోంది. మరి ఏం జరుగుతుందనేది చూడాలి.

# ఘనంగా కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ జన్మదిన వేడుక

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూలై 27:** 13వ వార్డు కార్పొరేటర్ సునీత సత్యనారాయణ జన్మదినం సందర్భంగా వార్డులో పలు ప్రాంతాలలో అభిమానులు కార్యకర్తలు ప్రజలు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్డు పార్టీ కార్యాలయంలో పలుప్రాంతాల నుండి పార్టీ నాయకులు కార్యకర్తల ప్రజల ఆనందోత్సవాలు మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అభిమానులు నాయకులు పుష్పగుచ్చాలతో అభినందించి సార్ వాళ్ళతో సత్కరించి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. సందర్భంగా ఆమెకు జన్మదినశుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి కార్పొరేటర్ దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.





# మండల కేంద్రంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహణ

## డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి వి చిన్నన్న

## కార్యదర్శులు ఎల్ సింహాచలం, టి సూర్యనారాయణ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 27.** మండల కేంద్రమునందు భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా పారిశుద్ధ్య నిర్మూలనలో భాగంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందని మండల డిప్యూటీ అభివృద్ధి అధికారి వి చిన్నాన్న, కార్యదర్శులు ఎల్ సింహాచలం, టి సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆదివారం మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రత్యేక పర్యవేక్షణలో గ్రామం మొత్తం స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందని, కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఇంటిలోని వ్యర్థాలను రోడ్డు మీద పారవేయకుండా ఒక ప్రక్కగా ఉంచిన యెడల పంచాయితీ పారిశుద్ధ్య సిబ్బంది వచ్చి తీసుకువెళ్తారన్నారు. ప్రధానంగా ప్రజలు ఇంటిముందు నీటి గుంటలు ఉండకుండా చూసుకోవాలని కోరారు. కుటుంబంలో విషపు జ్వరాలు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. స్థానిక దుకాణా దారులు అందరూ వారి షాపు ముందర ప్రత్యేక డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని, ఈ విధమైన ఏర్పాటు ఉల్లంఘించినటువంటి షాపు యజమానులకు జరిమానా విధించబడునని తెలిపారు. పారిశుద్ధ్య మరియు ఆరోగ్య విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందికి, సచివాలయ సిబ్బందికి సహకరించవలసిందిగా ప్రజలకు సూచించారు. మండల కేంద్రము నందు, మండల పరిధిలో కుళ్ళిన, శుభ్రత లేని, నిల్వ ఉన్న మాంసమును విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయితీ సర్పంచ్ సుభాస్ తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధకు సిబ్బంది అందరూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# ఆధ్యాత్మికం: ధర్మం అంటే ఏమిటి.. ధర్మరాజు .. యక్షుడితో చెప్పినది ఇదే..!

**ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః**
**తస్మాత్ ధర్మం న హంతవ్యమానో ధర్మో హతోవధీత్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ధర్మాన్ని హరిస్తే తిరిగి ధర్మం వారిని హరిస్తుంది. ధర్మాన్ని కాపాడితే అది వారిని కాపాడుతుంది. కనుక ధర్మాన్ని ధ్వంసం చెయ్యరాదు... అని మహాభారతం కథ మనకు తెలియచేస్తోంది. ధర్మవిరుద్ధంగా ప్రవర్తించినవారు చివరకు ఆ కారణంగా హతులవుతారు. ఇందుకు ఉదాహరణ మహాభారతం. కౌరవులు అనుక్షణం ధర్మాన్ని అతిక్రమించారు. కర్ణుడు, శకుని వారికి తోడయ్యారు. అందరూ అధర్మయుతంగానే జీవించారు. అందుకే చివరకు వారిని ధర్మమే నాశనం చేసింది. ఈ ధర్మం గురించి అరణ్య పర్వంలో ధర్మరాజు యక్షుడితో సంభాషిస్తాడు. ఒకనాడు జూదంలో ఓడిన పాండవులు.. ఒప్పందం ప్రకారం పన్నెండేళ్ల అరణ్యవాసం, ఒక సంవత్సర కాలం అజ్ఞాతవాసం చేయవలసి వచ్చింది. అలా పాండవులు అరణ్యవాసం చేస్తున్న రోజుల్లో.. ఒకరోజు పాండవులకు బాగా దాహం వేసింది. నీరు తీసుకునిరావడం కోసం.. అన్నగారైన ధర్మరాజు అనుజ్ఞ మేరకు నకులుడు దూరాన ఉన్న సరస్సు దగ్గరకు వెళ్లి, నీరు తాగబోయాడు. ఆ కొలను దగ్గర ఉన్న ఒక యక్షుడు.. 'ఈ సరస్సు నాది. దీని మీద నాకు మాత్రమే అధికారం ఉంది. నేనడిగిన ప్రశ్నలకు సమాధానం చెబితే, నువ్వు నిశ్చింతగా నీరు తాగి వెళ్లవచ్చు' అన్నాడు. నకులుడు ఆ మాటలు లెక్కచేయకుండా కొలనులోకి దిగాడు. నీరు తాగిన వెంటనే పడిపోయాడు. మిగిలిన ముగ్గురు కూడా అదే రీతిలో నీరు తాగి పడిపోయారు. ధర్మరాజు తమ్ముళ్లను వెతుకుతూ వచ్చి, తమ్ముళ్లు అపస్మారకంగా పడి ఉండటం చూశాడు. ధర్మరాజు విషయం తెలుసుకున్నాడు. అప్పుడు యక్షుడు ధర్మరాజును పలు అంశాల మీద ప్రశ్నించాడు. ధర్మరాజు అన్ని ప్రశ్నలకు తగిన సమాధానం చెప్పాడు. యక్షుడు సంతుష్టుడయ్యాడు. 'ధర్మరాజా! నీ సమాధానాలకు నేను సంతోషించాను. నీ సోదరులలో ఒకరిని బతికిస్తాను. ఎవరు కావాలో కోరుకో' అన్నాడు. అందుకు ధర్మరాజు.. 'అయ్యా! కుంతీ పుత్రులలో నేనున్నాను. మా పినతల్లి మాద్రి తనయులు ఇద్దరూ విగతజీవులయ్యారు. వారిలో నకులుని బతికించు' అన్నాడు. తన సొంత తమ్ముళ్లను కాక సవతి తల్లి కొడుకును బతికించమని అడిగినందుకు యక్షుడు ఆశ్చర్యపోయాడు. అతడి ధర్మ నిరతి చూసి సంతోషించాడు. ఆ సందర్భంలో ధర్మరాజు ఈ శ్లోకం పలికాడు. ధర్మాన్ని హరిస్తే అది మనల్ని హరిస్తుంది. కనుక ధర్మాన్ని ఎన్నడూ విడువనని పలికాడు. అంతేకాదు.. దెబ్బతిన్న ధర్మం మనల్ని దెబ్బతీయరాదు కనుక.. తన తల్లులైన.. కుంతి, మాద్రి... ఇద్దరి బిడ్డలూ బతికి ఉండాలని తన కోరిక చెప్పాడు. అందుకు సంతోషించిన యక్షుడు అందరినీ బతికించాడు. గాంధారి గర్భం ధరించిన సమయంలో.. కుంతికి తొలి సంతానం కలిగిందనే ఈర్ష్యతో గర్భతాడనం చేసుకుంది. అందుకే ఆవిడ గర్భాన.. ఈర్ష్య, అసూయలతో నిండిన సంతానం జన్మించారు. పుట్టినది మొదలు కౌరవులు... పాండవుల పట్ల అధర్మంగా ప్రవర్తిస్తూనే వచ్చారు. వారికి కర్ణుడు తోడయ్యాడు. వారంతా కన్నుమూసేవరకు ధర్మానికి విఘాతం కలిగేలా.. అధర్మమార్గాన్నే అనుసరిస్తూ వచ్చారు. ఎంతో శక్తిసంపన్నులైన కురుపాండవులకు తాతగారే కాక ప్రథమ గురువు అయిన భీష్ముడు, అస్త్రవిద్యను నేర్పిన గురువులు ద్రోణుడు, అర్జునునితో సమానమైన పరాక్రమం గల కర్ణుడు... వంటి ఎందరో యోధులు కౌరవుల పక్షాన ఉన్నారు. అయినప్పటికీ పాండవుల మీద విజయం సాధించలేకపోయారు. వారంతా ధర్మాన్ని అతిక్రమించటం వల్లే వారిని ఆ ధర్మమే శిక్షించిందని వ్యాసుడు మనకు వివరిస్తున్నాడు. అనేక సందర్భాలలో ధర్మరాజు ధర్మం గురించి చెబుతూనే ఉంటాడు. అందుకే ధర్మానికి రాజు అయ్యాడు. ఏది ధర్మమో తెలిసి, దానిని పాటించాడు. కనుక ధర్మం అతనిని కాపాడింది. మానవులు ఆచరించవలసిన ఇటువంటి సమస్త ధర్మాలను అందించినవారు వ్యాసమహర్షి. ఇక్కడ ధర్మం గురించి చెప్పిన వ్యాసమహర్షిని ఒక్కసారి స్మరించుకుందాం. "వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం" అని తెలిసిందే. నేటివరకూ మనం ఏ పని చేస్తున్నా, ఏ దైవాన్ని ప్రార్థిస్తున్నా, ఏ ఆలోచన చేసినా ... అంతా వ్యాసుడు బోధించినదే. మహాభారతమంతా ధర్మాన్నే బోధించాడు వ్యాసభగవానుడు.

# యాదిలో.. మైసూరు నవాబు.. ఆయన చరిత్ర ఇదే..!



**హైదరాబాద్ పెన్ పవర్:** మైసూరు చరిత్రకారుల ప్రకారం హైదర్? అలీ మహమ్మద్ ప్రవక్త వంశానికి చెందినవాడు. హైదర్? అలీ1717లో మైసూర్?లోని బుడికోట్?లో పుట్టాడు. అతని తండ్రి పేరు ఫతే మహమ్మద్. 1749లో హైదర్ మైసూర్? సైన్యంలో తన అన్న షాబాజ్ పలుకుబడితో ఉద్యోగంలో చేరాడు. హైదర్?కు భయమంటే తెలియదు. అతని ధైర్యం మైసూర్ అమాత్యులైన నాన్?రాజ్? దృష్టిని ఆకర్షించింది. దాంతో ఆయన హైదర్?కు మొదటి ప్రమోషన్ ఇచ్చాడు. ఆ తర్వాత ఆయన మైసూర్ దళంతో నసీర్ జంగ్?కు సాయం చేయడానికి వెళ్లాడు.

అలా నసీర్ జంగ్, హైదరాబాద్? నిజాం ఖాళీ సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడు. కానీ, అతడిని ఫ్రెంచ్?వాళ్లు ఓడించి, చంపేశారు. దాంతో మైసూర్ దళాలు వెనుదిరిగాయి. కానీ, హైదర్? అయోమయ పరిస్థితిలో నసీర్ జంగ్? సంపదలో కొంతభాగం దోచుకునేందుకు సాయపడి, సొంత నిధులను సమకూర్చుకున్నాడు. ఆయన 1500 అశ్విక దళం, 3000 కాల్బలాన్ని సమకూర్చుకుని దక్కన్ బ్రాహ్మణుడైన ఖండేరావును కార్యదర్శిగా నియమించుకున్నాడు. 1755లో ఆయన దిండిగల్? గవర్నర్?గా ఉద్యోగ ఉన్నతి పొందాడు. అతడు ఆ పదవిని వెంటనే పాండిచ్చేరి ఫ్రెంచి అధికారుల సాయంతో ఎంతో బలోపేతం చేశాడు. ఆ సమయంలోనే ఆయనకు ఫ్రెంచి భాష పట్ల అమితమైన ఇష్టం కలిగింది.

1757లో కొత్త నిజాం సలాబత్? జంగ్?, తన ఫ్రెంచి సలహాదారుడు ఎండి. బుస్సీతో కలిసి కప్పం వసూలు చేయడానికి మైసూర్?కు వెళ్లాడు. తన సోదరుడైన దేవరాజ్?శతృత్వం వల్ల ఆటంకం ఎదురైనప్పటికీ నాన్?రాజ్ దేవాలయాలన్నింటినీ దోచుకుని 18 లక్షలు చెల్లించి సలాబత్? జంగ్?ను కొనేశాడు. ఆ నిజాం వెళ్లగానే 3వ పీష్వా అయిన బాలాజీ బాజీరావు నేతృత్వంలో మరాఠాలు వచ్చారు. వాళ్లను లక్షల రూపాయలు, విలువైన జిల్లాలను తాకట్టుపెట్టి కొనడంతో మైసూరు ఖజానా ఖాళీ అయింది.

జీతాలు లేకపోవడంతో సిపాయిలు తిరుగుబాటు చేశారు. నాన్?రాజ్ హైదర్? అలీకి కబురు పంపాడు. అతని ఆజ్ఞతో ఖండేరావు జాగ్రత్తగా లెక్కలన్నీ తనిఖీ చేసి తిరుగుబాటుదారుల డిమాండ్లను కొంత మొత్తానికి తగ్గించి, 4 వేల మందిని తొలగించి, మిగతా వాళ్లకు, వాళ్ల నాయకులకు ఆస్తులను కొల్లగొట్టి చెల్లించాడు. సైన్యం విధేయత చూపింది. హైదర్? అలీ, పీష్వాతో సంధిని రద్దు చేశాడు.

గోపాలరావు పట్వర్ధన్? ఆధ్వర్యంలో మరాఠా దళం మళ్లీ వచ్చింది. హైదర్? అలీ పట్వర్ధన్? మీదికి వెళ్లి, తన తెలివితేటలతో అతడు తాకట్టుపెట్టిన జిల్లాలను ఆక్రమించుకోకుండా విఫలం చేశాడు. దాంతో పట్వర్ధన్ కొన్ని షరతుల మీద వెనుదిరిగాడు. హైదర్ సాహసాన్ని చూసిన రాజా చిక్కరాజ్? అతనికి కృతజ్ఞత చూపిస్తూ ఫతే హైదర్ బహదూర్? అనే బిరుదు ఇచ్చాడు. 1763లో హైదర్? అలీ బద్నూర్?కు తన సంస్థానంలో కలుపుకున్నాడు. ఆ తర్వాత కొత్త పీష్వా మాధవరావు హైదర్? అలీ ఎత్తులకు పై ఎత్తులు వేసి ఓడించాడు. తనకు జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికి హైదర్? అలీ తన దృష్టిని మలబారు కోస్తా మీదికి మళ్లించాడు. ఆ తర్వాత1767 నుంచి 1769 వరకు మద్రాస్?లోని ఇంగ్లిష్? వారితో, ఆర్కాబు నవాబు మొహమ్మద్ అలీతో యుద్ధం చేశాడు. బ్రిటిష్ వారి అధీనంలో ఉన్న ఒక్కొక్క జిల్లాను ఆక్రమించుకుంటూ మద్రాసుకు ఐదు మైళ్ల దూరానికి చేరుకున్నాడు. ఈ సాహసానికి తగిన ప్రతిఫలంగా మద్రాసు ప్రభుత్వం రక్షణ ఒప్పందం చేసుకుంది. ఆ వెంటనే హైదర్? అలీ మరాఠా దండయాత్రను మళ్లీ ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా మరెన్నో ఆటంకాలను ఎదుర్కొంటూ జయాపజయాలను విస్మరిస్తూ సాహసోపేతంగా ముందుకెళ్లాడు.

1782 జూన్? 2న హైదర్ అలీ చివరి యుద్ధం చేశాడు. అప్పటికే కొంతకాలంగా క్యాన్సర్?తో బాధపడుతున్న ఆయన డిసెంబర్ 7న చిత్తూర్ శిబిరంలో మరణించాడు. హైదర్? అలీ మైసూర్?కు ఎనలేని కీర్తి తెచ్చిపెట్టాడు. నిరక్షరాస్యుడైనా దేశ ఆర్థిక పరిస్థితిని పునరుద్ధరించాడు. వారసులకు గొప్ప ఖజానా, సమర్థవంతమైన సైన్యాన్ని ఇచ్చాడు.

# సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ కేసులో ఏడుగురు నిందితులకు రిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** పెళ్లై ఏళ్లు గడుస్తున్నా పిల్లలు కలగక పోవటంతో.. డాక్టర్లను దేవుళ్లుగా భావించి తమకు సంతానం కలిగేలా చేస్తారని నమ్మకంతో వెళ్లిన దంపతులను దారుణంగా మోసం చేశారు సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాహకులు. ఈ కేసును సీరియస్ గా తీసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సికింద్రాబాద్ లో సంచలనం సృష్టించిన సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ కేసులో నిందితులను రిమాండ్ కు తరలించారు. ఆదివారం (జులై 27) మారేడుపల్లిలో జడ్జి క్వాటర్స్ లో జడ్జి ఎదుట ఏడుగురు నిందితులను ప్రవేశపెట్టారు గోపాలపురం పోలీసులు. న్యాయమూర్తి నిందితులకు14 రోజులపాటు రిమాండ్ విధించారు. ఆ తర్వాత ఏడుగురిన చంచల్ గూడా జైలుకు తరలించారు. అసలు ఏం జరిగిందంటే.. సికింద్రాబాద్ మారేడ్ పల్లికి చెందిన దంపతులకు పిల్లలు లేకపోవడంతో ఐవీఎఫ్ కోసం సికింద్రాబాద్ లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ ను ఆశ్రయించారు. అయితే, ఆమె భర్త నుంచి కాకుండా వేరే వ్యక్తి నుంచి వీర్యకణాలు సేకరించి పిండాన్ని వృద్ధి చేశారు. పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాల తర్వాత ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఓ ఆస్పత్రిలో చికిత్స ఇప్పించారు. శిశువుకు క్యాన్సర్ ఉన్నట్లు వైద్య పరీక్షల్లో బయట పడింది. తమ వంశంలో ఎవరికీ క్యాన్సర్ లేదని, మళ్లీ ఒకసారి పూర్తిగా టెస్టులు చేయాలని బాధిత దంపతులు కోరగా.. డాక్టర్లు డీఎన్ఏ టెస్టు చేశారు. బాబుకు, తండ్రి డీఎన్ఏకు సంబంధం లేదని టెస్టుల్లో తేలింది. దీంతో దిగ్భ్రాంతికి గురైన బాధిత దంపతులు.. గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ ఆసుపత్రిలో శనివారం (జులై 26) రోజంతా సోదాలు చేశారు. పేషెంట్ల ట్రీట్మెంట్?కు సంబంధించిన ఫైల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. సెంటర్? నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను అదుపులోకి తీసుకున్నారు. ఎంత మందికి వేరేవారి వీర్యంతో ఐవీఎఫ్ చేశారన్న కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## 64 ఓవర్లు.. 6 వికెట్లు: గిల్ వీరోచిత సెంచరీ..
# డ్రా కోసం పోరాడుతున్న టీమిండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరుగుతున్న నాలుగో టెస్టులో టీమిండియా డ్రా కోసం పోరాడుతోంది. ఐదో రోజు టీమిండియా కెప్టెన్ శుభమాన్ గిల్, వాషింగ్ టన్ సుందర్ పట్టుదల చూపించడంతో డ్రా పై ఆశలు చిగురిస్తున్నాయి. గిల్ (103) వీరోచిత సెంచరీ చేయడంతో చివరి రోజు లంచ్ సమయానికి టీమిండియా నాలుగు వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసింది. క్రీజ్ లో సుందర్ (20), జడేజా (0) ఉన్నారు. ప్రస్తుతం భారత జట్టు రెండో ఇన్నింగ్స్ లో మరో 88 పరుగులు వెనకబడి ఉంది. ఇంగ్లాండ్ బౌలర్లలో వోక్స్ రెండు.. స్టోక్స్, ఆర్చర్ తలో వికెట్ తీసుకున్నారు.

చివరి రెండు సెషన్ లలో ఇండియా 64 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేస్తే మ్యాచ్ డ్రా అవుతుంది. మరోవైపు ఇంగ్లాండ్ కు 6 వికెట్లు తీస్తే మ్యాచ్ తో పాటు సిరీస్ గెలుచుకుంటుంది. దీంతో ఐదో రోజు రెండో సెషన్ కీలకంగా మారనుంది. 2 వికెట్ల నష్టానికి 174 పరుగులతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియా తొలి అరగంట జాగ్రత్తగానే ఆడింది. నాలుగో రోజు మాదిరి ఐదో రోజు కూడా గిల్, రాహుల్ డిఫెన్స్ కే పరిమితమయ్యారు. ఈ క్రమంలో కవర్స్ లో గిల్ క్యాచ్ మిస్ అవ్వడం మనకు కలిసొచ్చింది. 70 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఈ జోడీని ఎట్టకేలకు ఇంగ్లాండ్ కెప్టెన్ స్టోక్స్ విడగొట్టాడు. రాహుల్ 90 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద స్టోక్స్ వేసిన ఒక ఇన్ స్వింగ్ డెలివరీ అనూహ్యంగా లోపలికి దూసుకొచ్చింది. దీంతో రాహుల్ ఎల్బీడబ్ల్యూ రూపంలో వెనుదిరగడంతో టీమిండియా మూడో వికెట్ కోల్పోయింది. ఐదో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చిన సుందర్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. గిల్ తో పాటు పూర్తిగా డిఫెన్స్ కే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో గిల్ 228 బంతుల్లో తన సెంచరీ మార్క్ అందుకున్నాడు. గిల్ కు ఈ సిరీస్ లో ఇది నాలుగో సెంచరీ కావడం విశేషం. ఓవరాల్ గా టెస్ట్ క్రికెట్ లో 9 వ సెంచరీ.

లంచ్ కు ముందు జోఫ్రా టీమిండియాకు దిమ్మ తిరిగే షాక్ ఇచ్చాడు.

సెంచరీ చేసిన గిల్ ను ఔట్ చేసి ఇంగ్లాండ్ శిబిరంలో ఆనందాన్ని నింపాడు. అంతకముందు తొలి ఇన్నింగ్స్ లో ఇండియా 358 పరుగులు చేస్తే.. ఇంగ్లాండ్ 669 పరుగులకు ఆలౌటైంది.

# ఆసియా కప్ 2025.. ఇండియా- పాకిస్థాన్ మధ్య మూడు మ్యాచ్‌లు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ కు రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నీ షెడ్యూల్ ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ మోసిన్ నఖ్వీ శనివారం (జూలై 26) ప్రకటించారు. ఈ ఏడాది ఆసియా కప్ యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 28వ తేదీ వరకు జరగనుంది. ఈ టోర్నీ ఆడుతుంది 8 దేశాలైనా అందరి చూపు ఇండియా, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ మీద ఉంది. ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత తొలిసారి ఇండో%-%పాక్ గ్రౌండ్‌లో ఢీకొట్టనున్నాయి. రెండు జట్లు ఒకే గ్రూప్ లో ఉంచడంతో కనీసం ఇరు జట్ల మధ్య ఒక మ్యాచ్ చూడొచ్చు. మొత్తం ఎనిమిది జట్లు పోటీలో ఉండగా.. గ్రూప్%-%ఎలో ఇండియా, పాకిస్తాన్, యూఏఈ, ఒమన్.. గ్రూప్%-%బిలో శ్రీలంక, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్, హాంకాంగ్ బరిలో నిలిచాయి. దుబాయ్, అబుదాబి వేదికలుగా ఓవరాల్‌గా 19 మ్యాచ్‌లు జరుగుతాయి. టీమిండియా సెప్టెంబర్ 10న యూఈఏతో, 14న పాకిస్తాన్‌తో, 19న ఒమన్‌తో పోటీపడనుంది. గ్రూప్ ఏ లో ఇండియా, పాకిస్థాన్ సూపర్-4 కు అర్హత సాధించడం ఖాయంగా కనిపిస్తుంది. ఇదే గ్రూప్ లో బలహీనమైన ఒమాన్, యూఏఈ కూడా ఉండడంతో రెండు జట్లు సూపర్-4కు చేరే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. సూపర్-4 లో బాగా ఆడి ఇండియా, పాకిస్థాన్ టాప్-2 లో ఉంటే ఫైనల్లో దాయాదుల మధ్య మరోసారి పోరు చూడవచ్చు. దీంతో మొత్తం మూడు సార్లు ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ చూసే అవకాశం అభిమానులకి కలగనుంది. తటస్థ వేదికైన




యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో టోర్నీ మ్యాచ్ లన్నీ జరుగుతాయి. ఆసియా కప్‌కు ఆతిథ్య హక్కులు ఇండియాకే లభించినా.. ఇండో - పాక్ మ్యాచ్‌లు తటస్థ వేదికపై జరిగేలా బీసీసీఐ, పాక్ క్రికెట్ బోర్డు మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా టోర్నీని యూఏఈలో నిర్వహిస్తున్నారు. 2023లో జరిగిన గత ఎడిషన్‌లో రోహిత్ శర్మ కెప్టెన్సీలో టైటిల్ నెగ్గిన ఇండియా డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది.

# పాక్ సెమీస్‌కు వచ్చినా ఆడేది లేదు.. తేల్చి చెప్పిన టీమిండియా ఓపెనర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ వేదికగా ప్రస్తుతం వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ జరుగుతోంది. మాజీ స్టార్ క్రికెటర్లు ఈ లీగ్ లో ఆడుతూ అభిమానులకు వినోదాన్ని పంచుతున్నారు. ఈ లీగ్ లో ఇండియా, పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ చూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఉన్నారు. ఇండియా, పాకిస్థాన్ జట్లు ఐసీసీ టోర్నీల్లో మాత్రమే తలబడుతున్నాయి. అయితే డబ్ల్యూసీఎల్ చూసి ఎంజాయ్ చేద్దామనుకున్న ఫ్యాన్స్ కు నిరాశ తప్పేలా కనిపించడం లేదు. దాయాధి జట్లు వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) టోర్నమెంట్‌లో ఇప్పటికే జరగాల్సిన మ్యాచ్ లీగ్ మ్యాచ్ రద్దయిన సంగతి తెలిసిందే. లీగ్ మ్యాచ్ కావడంతో ఇండియా, పాక్ మ్యాచ్ రద్దు చేయవచ్చు. అయితే ఈ రెండు జట్లు ఫైనల్ కు వస్తే ఆడతాయా అనే ప్రశ్నకు టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పాడు. పాక్ ఫైనల్ కు వస్తే వారితో మ్యాచ్ ఆడడానికి నేను సిద్ధంగా లేను అని ధావన్ చెప్పాడు. శనివారం (జూలై 26) డబ్ల్యూసీఎల్ మ్యాచ్ తర్వాత సెమీఫైనల్లో భారతదేశం, పాకిస్తాన్ తలపడే అవకాశం ఉంది. ఒకవేళ పాక్ సెమీస్ కు వస్తే మీ వైఖరి మార్చుకుంటారు అని ధావన్ ను విలేకరి ప్రశ్నించాడు. ఈ ప్రశ్నపై ధావన్ చిరాకు పడుతూ కనిపించాడు. కోపంగా ధావన్ స్పందిస్తూ ఈ విధంగా చెప్పుకొచ్చాడు.. "మీరు ఈ ప్రశ్నను తప్పు సమయంలో, తప్పు ప్రదేశంలో అడుగుతున్నారు. ఇక్కడ మీరు ఈ ప్రశ్న అడగకూడదు. నేను ఇంతకు ముందు ఆడలేదు కాబట్టి ఇప్పుడు కూడా ఆడను". అని ధావన్ విలేకరితో అన్నాడు. ధావన్ సమాధానం వీడియో సోషల్ మీడియాలో కొద్దిసేపటికే వైరల్ అయింది. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా శిఖర్ ధవన్ సహా పలువురు ఇండియా వెటరన్ ప్లేయర్లు గత వారం పాకిస్థాన్ తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. మొత్తానికి పాక్, భారత్ జట్లు నాకౌట్ కు వస్తే ఆడతాయో లేదో చూడాలి.

# బికినీ కంటే ఘాటుగా దివి స్టన్నింగ్ లుక్!

టాలీవుడ్‌లో గ్లామర్‌తో పాటు అటిట్యూడ్‌కి కూడా ఓ రేంజ్ క్రేజ్ తెచ్చుకున్న యంగ్ బ్యూటీ దివి వాద్య. బిగ్‌బాస్ షోతో పాపులర్ అయిన ఈ గ్లామరస్ బ్యూటీ ఆ తర్వాత సినిమాలు, ఫ్యాషన్ షోస్, వెబ్ కంటెంట్‌తో మంచి హైప్ తెచ్చుకుంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో దివి చేసే ఫోటోషూట్లు తరచూ వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా బాలి ట్రిప్‌లో ఆమె వేసుకున్న గ్రీన్ డ్రెస్‌లో ఆమె పెట్టిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో హీటెక్కిస్తున్నాయి. గ్రీన్ మల్టీషేడెడ్ డిజైనర్ అవుట్‌ఫిట్‌లో దివి చేసిన ఈ ఫోటోషూట్ గ్లామర్, నేచురల్ వాతావరణం కలబోతగా ఆకట్టుకుంటోంది. ఫీల్డ్ బ్యాక్‌డ్రాప్ మధ్యలో ఆ డ్రెస్‌లో ఆమె చలాకీగా ఇచ్చిన పోజులు అందాన్ని ఓ కొత్త కోణంలో చూపిస్తున్నాయి. తళతళలాడే స్కిన్ టోన్, లాంగ్ హెయిర్, సింపుల్ మేకప్‌తో దివి ఇచ్చిన అటిట్యూడ్ కూడా ఈ లుక్స్‌కు హైలైట్ అయ్యింది. ఈ గ్లామరస్ లుక్ బికినీకి ఏమాత్రం తీసిపోనిది అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

దివి కెరీర్ విషయానికి వస్తే, మోడలింగ్ ద్వారా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఈ బ్యూటీ, బిగ్‌బాస్ షో ద్వారా మాస్ ఆడియెన్స్‌కి పరిచయమైంది. ఆ తర్వాత 'ఎటిఎం', 'రుద్రంగి' వంటి సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ చేసింది. అయితే ఆమె అందానికి టాలీవుడ్‌లో ఇంకా అంతగా క్లిక్కయ్యే రోల్స్ రాలేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఆమె క్రేజ్ రెట్టింపైపోతోంది.

ఈ మధ్యకాలంలో దివి ఓటీటీ ప్లాట్‌ఫార్మ్‌లపై కూడ కొన్ని వెబ్ షోస్, షార్ట్ ఫిలిమ్స్‌లో నటిస్తోంది. ట్రెడిషనల్ నుండి ట్రెండీ ఫ్యాషన్ వరకూ ఆమె ఫోటోషూట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. గ్లామర్‌తో పాటు క్యారెక్టర్ నెరేటివ్ ఉన్న పాత్రలపై దివి ఆసక్తిగా ఉంది. తనను నటిగా నిరూపించుకోవాలన్న ఆతృత ఆమె పనితనంలో స్పష్టంగా కనిపిస్తోంది.



'దమ్ దమ్' మ్యూజిక్ వీడియో నుండి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ యొక్క ఇష్టమైన క్షణం





సర్దార్ 2 కుమారుడు రోష్ని వాలియా ట్రెండీ ఫ్యాషన్ ఎంపికలతో ఆకట్టుకున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com